అంచనాకు మించి ఆర్థిక ప్రగతి

ఈనాడు, బెంగళూరు : మునుపెన్నడూ లేని కరవు పరిస్థితులు అలముకున్నా.. భౌగోళిక, రాజకీయ పరిస్థితులు ఐటీ రంగాన్ని దెబ్బతీసినా రాష్ట్ర ఆర్థిక ప్రగతికి ఇబ్బందులేమీ ఎదురుకాలేదని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వెల్లడించారు. జాతీయ ఆర్థిక గణాంకాల అంచనాలకు మించి రాష్ట్రం మెరుగైన ఆర్థిక ప్రగతిని సాధించిందని ప్రకటించారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ ఇదే జోరు కొనసాగిస్తామని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. సోమవారం ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటించిన రాష్ట్ర ఆర్థిక నివేదిక వివరాలిలా ఉన్నాయి.

జీఎస్‌డీపీలో దూకుడు..

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ఐటీ ఎగుమతులు దేశవ్యాప్తంగా దెబ్బతిన్నాయి. భారతదేశానికి అత్యధిక ప్రమాణంలో ఐటీ ఉత్పత్తులు అందిస్తున్న కర్ణాటక ఈ ప్రభావానికి లోనైంది. కరవు పరిస్థితులు ఆర్థిక కార్యకలాపాలను దెబ్బతీయటంతో కర్ణాటక రాష్ట్రం 2023-24 ఆర్థిక సంవత్సరంలో కేవలం నాలుగు శాతం ఆర్థిక ప్రగతిని మాత్రమే సాధించగలదని అంచనా వేశారు. ఈ ఏడాది చివరి నాటికి ఆ ప్రగతి 13.4 శాతంగా నమోదు కాగలదని జాతీయ ఆర్థిక గణాంకాల అంచనా(ఎన్ఎస్ఈ) విభాగంతో పాటు కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు శాఖ(ఎంఓఎస్‌పీఐ)లు ప్రకటించాయి.



సిద్ధరామయ్య


ఈ అంచనాకు మీరి కర్ణాటక రాష్ట్రం సెప్టెంబరు నాటికే జీఎస్‌డీపీలో 10.2 శాతం ప్రగతిని నమోదు చేసింది. ఈ ప్రగతి జాతీయ స్థూల దేశీయోత్పత్తి (8.2శాతం)తో పోలిస్తే రెండు శాతం ఎక్కువ. ప్రస్తుత ప్రగతి దృష్ట్యా 2025 ఆర్థిక సంవత్సరానికి 14 శాతం ప్రగతి సాధించే అవకాశం ఉందన్న ఆశాభావాన్ని ముఖ్యమంత్రి అంచనా వేశారు. కరవు కారణంగా రాష్ట్ర వ్యవసాయ రంగంలో ఉత్పాదన సన్నగిల్లింది. ఐటీ రంగం ప్రపంచ యుద్ధాల కారణంగా కుదేలయ్యింది. ఆర్థిక రంగంలో ద్రవ్యోల్బణం దూసుకొస్తుందన్న భయంలోనూ రాష్ట్ర ఐటీ, హార్డ్‌వేర్ రంగంలో 28 శాతం జీఎస్‌వీపీ (స్థూల రాష్ట్ర విలువ ఆధారిత వృద్ధి)ని సాధించింది. ఇదే సందర్భంగా దేశ ఐటీ రంగం 2022 ఏడాది 15.5 శాతంతో పోలిస్తే 2023లో కేవలం ఎనిమిది శాతమే ప్రగతిని నమోదు చేసినట్లు ముఖ్యమంత్రి ఆర్థిక సలహా విభాగం విశ్లేషించింది.



వేదికపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, మంత్రి డాక్టర్ పరమేశ్వర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్, డీజీపీ అలోక్‌మోహన్ తదితరులు

విధినిర్వహణలో రక్షకులకు స్వేచ్ఛ

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : వచ్చే ఏడాది చివరి నాటికి రూ.200 కోట్లతో వంద కొత్త పోలీసు ఠాణాలను నిర్మిస్తామని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటించారు. పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విధి నిర్వహణలో మరణించిన 12 మంది కర్ణాటక పోలీసులతో పాటు దేశవ్యాప్తంగా అమరులైన 216 మందికి సోమవారం నివాళి అర్పించి మాట్లాడారు. పోలీసు సిబ్బందికి ఇళ్లను నిర్మించి ఇచ్చే బాధ్యత ప్రభుత్వంపై ఉండడంతో ఇప్పటికే ఆ పని ప్రారంభించామని తెలిపారు. రూ.2 వేల కోట్లతో నిర్మిస్తున్న పది వేల ఇళ్లను వచ్చే ఏడాదికి అందుబాటులోకి తెస్తామని వివరించారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వాన్ని కాపాడేందుకు పోలీసులు నిరంతరం శ్రమిస్తున్నారని ప్రశంసించారు. ఏ రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉంటే.. అక్కడ పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. పోలీస్ కుటుంబాల్లోని విద్యార్థుల కోసం ఏడు పబ్లిక్ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. రహదారులపై ప్రమాదాలను తప్పించేందుకు, వాహనదారులపై నిఘా ఉంచేందుకు 260 వాహనాలు, 6 వేల సీసీ కెమెరాలతో నిరంతరం నిఘా కొనసాగుతుందని తెలిపారు. పోలీసులు స్వతంత్రంగా పని చేసేందుకు ప్రభుత్వం పూర్తి సహకారాన్ని అందిస్తోందన్నారు. సమాజంలో అసమానతలు, దౌర్జన్యాలు, నేరాలు, ఘోరాలను అరికట్టి శాంతిని నెలకొల్పేందుకు ప్రయత్నిస్తున్న పోలీసులకు కావలసిన అన్ని సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వ నిరంతరం సహకారాన్ని అందిస్తుందన్నారు. హోం మంత్రి జీ పరమేశ్వర్, ముఖ్యమంత్రి రాజకీయ కార్యదర్శులు గోవిందరాజు, నసీర్ అహ్మద్, డీజీపీ అలోక్ మోహన్, అధికారులు శానిలి రజనీశ్, ఎల్‌కే అతీక్, ఉమాశంకర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



సైనిక స్మారక ఉద్యానవనంలో స్తూపానికి ప్రత్యేక అలంకరణ

సైనికుడి తిరుగుబాటు

● చెన్నపట్టణ ఉపసమరమే ● యోగీ రాజీనామాతో ఆసక్తి

ఈనాడు, బెంగళూరు : ఊహించినట్లే చెన్నపట్టణ విధానసభ నియోజకవర్గ ఉప సమరం రసవత్తరంగా మారింది. లోక్‌సభ ఎన్నికల్లో కుదిరిన ఎన్‌డీఏ మిత్రసూత్రం ఉప ఎన్నికల్లో బెడిసికొట్టింది. బెంగళూరు గ్రామీణ లోక్‌సభకు జనతాదళ్ నేతల కుటుంబ సభ్యుడు డాక్టర్ సి.ఎన్. మంజునాథ్ భాజపా గుర్తుతో పోటీ చేసి ఘన విజయం సాధించారు. ఇదే సూత్రంతో చెన్నపట్టణ విధానసభ ఉప సమరానికి భాజపా నేత జేడీఎస్ గుర్తుతో పోటీ చేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ఈ ఒప్పందాన్ని భాజపా నేతలు తొలి నుంచీ ఆక్షేపిస్తూనే ఉన్నారు. గెలిచేందుకు అవకాశం ఉండిన కోలారు, మండ్య స్థానాలను జేడీఎస్‌కు ఇచ్చినట్లే చెన్నపట్టణను భాజపాకు ఇవ్వాలని పట్టుబట్టారు. భాజపా చేసిన ప్రతిపాదనను తోసిపుచ్చిన జేడీఎస్ తమ నియోజకవర్గంలో తుది నిర్ణయం మాదేనంటూ పట్టుబట్టింది. భాజపా అధిష్ఠానం జేడీఎస్‌కు మద్దతివ్వటంతో కమలదండు రాష్ట్ర శిబిరంలో అలజడి రేగింది. ఈ సంకటం- చివరికి గెలిచే సత్తా ఉన్న సి.పి. యోగేశ్వర్ రాజీనామా వరకు దారి తీసింది. ఓ వైపు భాజపా, జేడీఎస్ కీలక నేతల చర్చలు కొనసాగుతుండగానే కఠినమైన నిర్ణయం తీసుకున్న యోగేశ్వర్ ఈ ఉపసమరాన్ని రక్తి కట్టించారు.



చెన్నపట్టణ బొమ్మ.. రంగులు మార్చుతోంది..



ఎత్తుగడలతో కుమారస్వామి

చరిత్ర మరవని వైరం

చెన్నపట్టణలో మూడు దశాబ్దాలుగా బద్ధ శత్రువులుగా తలపడే పార్టీలు భాజపా- జేడీఎస్‌లే. 1989 వరకు కాంగ్రెస్ జనతాపార్టీల మధ్య సాగిన రాజకీయ సమరం 1994 నుంచి మారిపోయింది. 1999లో సైనిక సేవలకు స్వస్తి చెప్పిన సి.పి. యోగేశ్వర్ నేరుగా రాజకీయ రంగ ప్రవేశం చేశారు. ఆ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా గెలిచి.. ఆపై కాంగ్రెస్‌లో చేరి రెండుసార్లు విజయం సాధించారు. 2009లో జేడీఎస్ అభ్యర్థి గెలిచి యోగేశ్వర్‌పై సవాలు విసిరారు. రాజకీయ చదరంగంలో కాంగ్రెస్ గూటి నుంచి భాజపా వైపు మళ్లిన యోగేశ్వర్ వరుసగా రెండుసార్లు విజేతగా నిలిచారు. ఆపై రెండు ఎన్నికల్లో కుమారస్వామి ఈ చోట యోగేశ్వర్‌కు గట్టి పోటీ ఇస్తూ గెలుస్తూ వచ్చారు. ఇక్కడ పార్టీలేవైనా యోగేశ్వర్‌కు చెక్కుచెదరని రాజకీయ బలం ఉంది. భాజపా కూడా యోగేశ్వర్ కారణంగానే పాత మైసూరులో కాస్తో కూస్తో ప్రభావాన్ని చూపగలుగుతోంది. మారిన రాజకీయ పరిణామాల్లో భాజపా, జేడీఎస్ జాతీయ నేతలు ఒక్కటైనా రాష్ట్ర, స్థానిక నేతలు మాత్రం అదే వైరాన్ని కొనసాగించటమే తాజా ఉప ఎన్నికల్లో సంకటానికి కారణమైంది.

రాజీనామా ఇలా..

పట్టున్న చెన్నపట్టణ క్షేత్రాన్ని భాజపాకు ఇచ్చేందుకు సిద్ధమైన జేడీఎస్ ఓ మెలిక పెట్టింది. 'మీరే పోటీ చేయండి.. మా గుర్తుతో' అన్న సూచన చేసిన జేడీఎస్‌కు భాజపా నేతల నుంచి వ్యతిరేకత ఎదురైంది. విపక్ష నేత ఆర్. అశోక్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బి.వై. విజయేంద్ర, మాజీ ఉపముఖ్యమంత్రి అశ్వత్థనారాయణ తదితరులంతా యోగేశ్వర్‌కు టికెట్ దక్కాలని ఎంతగానో ప్రయత్నించారు. జేడీఎస్ గుర్తుతో పోటీ చేయాలన్న నిబంధనను భాజపా జీర్ణించుకోలేక పోయింది. స్వతంత్రుడిగా పోటీ చేసినా గెలిచే సత్తా ఉన్న యోగేశ్వర్‌ను దళ్ ప్రతిపాదన రగిలేలా చేసింది. అధిష్ఠానం ఇక్కడ ఎన్‌డీఏ అభ్యర్థిని ఎంపిక చేసే స్వేచ్ఛను కేంద్ర మంత్రి కుమారస్వామికి విడిచిపెట్టటం, భాజపా పార్లమెంటరీ మండలి సభ్యుడు యడియూరప్ప అదే అభిప్రాయంతో ఉండటంతో యోగేశ్వర్ ప్రత్యామ్నాయ మార్గాన్ని అన్వేషించారు. అందులో భాగంగానే స్వతంత్రుడిగా పోటీ చేసేందుకు నిర్ణయించుకున్నారు. అందుకు అడ్డుగా ఉన్న విధానపరిషత్ సభ్యత్వానికి రాజీనామా చేస్తూ.. సోమవారం హుబ్బళ్లిలో సభాపతి బసవరాజ హొరట్టికి సంబంధిత పత్రం అందించి తిరుగుబాటు ప్రకటించారు.

కాంగ్రెస్ గాలం..

తాను పరిషత్ స్థానానికి మాత్రమే రాజీనామా చేశాను. ఇంకా.. భాజపా, జేడీఎస్ నేతలు మనసుపెడితే నాకు టికెట్ ఇవ్వగలరని యోగేశ్వర్ ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ గుర్తు లేకున్నా స్వతంత్రుడిగా పోటీ చేయాలనే రాజీనామా చేసినట్లు వెల్లడించారు. స్వచ్ఛందంగా చేసిన ఈ రాజీనామాతో తన పోటీ తథ్యమని సంకేతాలిచ్చిన ఆయన నిర్ణయాన్ని భాజపా, జేడీఎస్ తప్పుబట్టాయి. చర్చల దశలో ఉండగానే ఈ నిర్ణయం తీసుకోవటం తగదని ఆర్. అశోక్ వ్యాఖ్యానించారు. ఎన్‌డీఏ అభ్యర్థిగా ఏకైక ఐచ్ఛికమైన యోగేశ్వర్ రాజీనామాతో చెన్నపట్టణ అభ్యర్థి ఎంపిక ఆసక్తిగా మారింది. ఆయన రాజీనామా చేయగానే జేడీఎస్ శిబిరంలో వ్యూహాలు చకచకా మారాయి. మాజీ ప్రధానమంత్రి దేవేగౌడ నివాసంలో కేంద్ర మంత్రి కుమారస్వామి, ఆయన కుమారుడు నిఖిల్ కుమారస్వామి సుదీర్ఘంగా చర్చించారు. మరోవైపు విపక్ష నేత ఆర్. అశోక్ మంగళవారం ఇక్కడి రాజకీయ పరిణామాలపై చర్చించేందుకు దిల్లీకి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. నిఖిల్ కుమారస్వామి పోటీ చేయరని కుమారస్వామి ప్రకటించినా పార్టీ కార్యకర్తల ఒత్తిడి అంటూ.. ఆయననే బరిలో దింపాలని చూస్తున్నారు. మరోవైపు ఈ రెండు పార్టీల మధ్య రాజుకున్న చిచ్చుతో లబ్ధి పొందాలని చూస్తున్న కాంగ్రెస్ యోగేశ్వర్‌తో మంతనాలు జరిపేందుకు సిద్ధమైనట్లు సమాచారం. మొత్తంగా.. యుద్ధంలో ప్రత్యర్థులతో పోరు సాగించి విరమించుకున్న యోగేశ్వర్ మరోసారి రాజకీయ సమరంలో తిరుగుబాటుతో చెన్నపట్టణ పోరును ఆసక్తిగా మార్చారు.



రాజీపడని యోగేశ్వర్

నేనూ.. పోటీకి సై

రామనగర, న్యూస్‌టుడే : చెన్నపట్టణ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో పోటీకి తాను సిద్ధంగా ఉన్నానని మాజీ మంత్రి సీపీ యోగేశ్వర్ కుమార్తె నిశా తెలిపారు. తండ్రి నుంచి పలు సంవత్సరాల కిందటే ఆమె గొడవ పడి వేరుగా ఉంటున్నారు. నీకు టికెట్ ఇస్తే, మీ తండ్రితో ఉద్దేశపూర్వకంగా వైరం పెట్టుకున్నట్లు ఉంటుందని ఆమెకు గతంలోనే పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ హితవు పలికి పంపించారు. తాను సమాజ సేవ చేయాలన్నా తండ్రి, అతని అనుచరుల నుంచి బెదిరింపులు వస్తున్నాయని నిశా ఆక్రోశించారు. తన సమస్యలను అన్నింటినీ వీడియో చేసి త్వరలో విడుదల చేస్తానని ఆమె సోమవారం వెల్లడించారు.



కెంగేరి సమీపంలో రహదారిపై నిలిచిన వరదనీరు



అగర మార్గంలో అడుగేయడమే పెద్ద సాహసం



కోరమంగలలోని వీధుల్లో సోమవారం ఉదయం పరిస్థితి ఇదీ



కోరమంగలలోని ఒక అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో మునిగిన వాహనం

పడునెక్కిన జలఖడ్గం



బెంగళూరు హెచ్ఎస్ఆర్ లేఅవుట్‌ను వానదేవుడు నిలువునా ముంచేశాడు..

బెంగళూరు గ్రామీణం, న్యూస్‌టుడే : రాష్ట్ర వ్యాప్తంగా వరుణదేవుడు వీరవిజృంభణకు దిగాడు. శనివారం అర్ధరాత్రి దాటాక మొదలుపెట్టిన భారీ వర్షం రాజధాని బెంగళూరు నగరంలోని జనజీవనాన్ని అస్తవ్యస్తం చేసింది. కోరమంగల, అగర, ఉత్తరహళ్లి, హెచ్ఎస్ఆర్ లేఅవుట్, మడివాళ, హొసకెరెహళ్లి తదితర ప్రాంతాల్లో రహదారులపై పలు చోట్ల మోకాలి లోతు నీరు నిలిచింది. హొసకెరెహళ్లి ట్యాంక్‌బండ్ రహదారి మొత్తం బురదగా మారిపోయింది. ఇళ్లలోకి బురదతో కూడిన నీరు ప్రవేశించింది. నీటిని శుభ్రం చేసుకున్న వారికి సోమవారం మళ్లీ నీరు రావడంతో నిరాశకు గురయ్యారు. నగరంలో ఆరెంజ్ అలర్ట్‌ను ప్రకటించడంతో బెంగళూరు నగర, బెంగళూరు గ్రామీణ జిల్లాల్లో విద్యాసంస్థలు, అంగన్‌వాడీలకు సోమవారం సెలవు ప్రకటించారు. వారం వ్యవధిలోనే వర్షం కారణంగా నగరంలోని పాఠశాలలకు సెలవు ఇవ్వడం ఇది రెండోసారి. విద్యాసంస్థల్లో చేరుకున్న నీటిని, విరిగిపడిన చెట్లు, చెట్టు కొమ్మలను యుద్ధ ప్రాతిపదికన తొలగించారు. ఆరెంజ్ అలర్ట్ నేపథ్యంలో నగరంలో 11-20 సెం.మీ. వర్షపాతం నమోదవుతుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

రాష్ట్రంలో అప్రమత్తం..

ఈ వారంతం వరకు రాష్ట్రంలోని పాతిక జిల్లాల్లో ఎల్లో అలర్ట్ కొనసాగుతుందని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు. హావేరి, దావణగెరె, శివమొగ్గ, చిక్కమగళూరు జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షంతో పలు వాణిజ్య పంటలు దెబ్బతిన్నాయి. ఉత్తరకన్నడ, దక్షిణ కన్నడ, ఉడుపి, బెళగావి, ధార్వాడ, గదగ, హావేరి, బళ్లారి, బెంగళూరు, బెంగళూరు గ్రామీణ, చామరాజనగర, చిక్కబళ్లాపుర, చిత్రదుర్గ, దావణగెరె, హాసన, కొడగు, చిక్కమగళూరు, కోలారు, మండ్య, మైసూరు, రామనగర, శివమొగ్గ, తుమకూరు, చామరాజనగర జిల్లాలలో భారీ వర్షాలు కొనసాగనున్నాయి. హావేరి సమీపంలోని బరదూరులోని మఠంలోకి నీరు చేరుకోవడంతో అక్కడ భక్తులు చిక్కుకుపోయారు. అగ్నిమాపకదళ సిబ్బంది వారిని బయటకు తీసుకువచ్చారు. దావణగెరె శివార్లలోని కుర్కి గ్రామం వద్ద అండర్‌పాస్‌లో విద్యార్థులతో వెళుతున్న పాఠశాల వ్యాను చిక్కుకుపోయింది. వ్యానులోకి నీరు చేరుకోవడంతో విద్యార్థుల పుస్తకాలు తడిచిపోయాయి. అగ్నిమాపకదళ సిబ్బంది ఆ వ్యానును బయటకు తీశారు. రాణెబెన్నూరు సమీపంలోని రైల్వే అండర్‌పాస్ కింద 18 మందితో వెళుతున్న టెంపో నీటిలో నిలిచిపోయింది. క్రేన్ సహాయంతో టెంపోను బయటకు తీసుకువచ్చారు.



మైసూరు కృష్ణరాజేంద్ర కూడలిలో నీటి దెబ్బకు మందగించిన రాకపోకలు



ఉద్యాననగరి విల్సన్‌గార్డెన్ వాడల్లో రాకపోకలు.. అత్యంత ప్రమాదకరం

వీధులే.. కాలువలు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : సెప్టెంబరు చివరి వారం నుంచి ఇప్పటి వరకు మధ్యలో కొన్ని రోజులు మినహా బెంగళూరు నగరంలో నిత్యం వర్షం కురుస్తోంది. యలహంకలోని కేంద్రీయ విహార్ అపార్ట్‌మెంట్ ఆవరణ, హెణ్ణూరు, చెరువులకు సమీపంలో ఉంటున్న ప్రాంతాల్లోకి వర్షం నీటితో పాటు చేపలు కొట్టుకు వస్తున్నాయి. 'బ్రాండ్ బెంగళూరు' పేరిట ప్రభుత్వం ప్రచారానికే పరిమితమైందని విపక్షాలు విమర్శలు గుప్పించగా.. గత పాలకులు చేసిన తప్పులను తాము సరి చేస్తూ వస్తున్నామని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రత్యారోపణకు దిగారు. కోరమంగల, మడివాళ, అగర, సర్జాపుర రోడ్డు, హెణ్ణూరు తదితర ప్రాంతాల్లోని అపార్ట్‌మెంట్ల సెల్లార్లలోకి నీరు ప్రవేశించింది. బైకులు, కార్ల పొగగొట్టాల్లోకి నీరు చేరి, అవి పాడయ్యాయి. రాచకాలువకు- కొన్ని వీధులకు తేడా లేకుండా కాలువల మాదిరి మారిపోయాయి. వర్షం విపత్తుల నుంచి శాశ్వత పరిష్కారాన్ని కనుగొనేందుకు నిపుణులతో చర్చిస్తున్నామని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తెలిపారు.



లాల్‌బాగ్ చెరువులో నిండుగా నీరు

ఉత్తర భద్రపై విచారణ వాయిదా

ఈనాడు, దిల్లీ : బచావత్ ట్రైబ్యునల్ 1, 2 తీర్పులకు విరుద్ధంగా కర్ణాటక ప్రభుత్వం చేపట్టిన ఉత్తర భద్ర ప్రాజెక్టు నిర్మాణాన్ని నిలిపేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాఖలుచేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు డిసెంబరు 11కు వాయిదా వేసింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీచేసింది. తొలుత ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్త వాదనలు వినిపిస్తూ తాము ఈ కేసును ఆర్టికల్- 131కింద దాఖలు చేశామని, అందువల్ల దీనికి, ఇదివరకు ఇదే జలవివాదాలపై దాఖలైన ఇతర కేసులకు సంబంధం లేదు కాబట్టి ప్రత్యేకంగా విచారించాలని ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. 1976లో వచ్చిన బచావత్ ట్రైబ్యునల్ తీర్పుతోపాటు, 2011లో వచ్చిన కేడబ్ల్యూడీటీ-2 అవార్డును ఉల్లంఘించి కర్ణాటక ప్రభుత్వం ఈ ప్రాజెక్టును నిర్మించినందున తాము తాజా కేసు దాఖలు చేసినట్లు తెలిపారు. అప్పుడు జస్టిస్ సూర్యకాంత్ జోక్యం చేసుకుంటూ ఈ ప్రాజెక్టును నిలువరించాలని మీరు కోరుతుంటే, దానిపై తాము ఈ ఏడాది జనవరి నాటికి రూ. 8,724 కోట్లు ఖర్చు చేశామని కర్ణాటక కౌంటర్ అఫిడవిట్‌లో చెబుతోంది కదా? అని గుర్తుచేశారు.



విభేదించిన ఏపీ న్యాయవాది

ఈ వాదనలతో ఏపీ ప్రభుత్వ న్యాయవాది విభేదించారు. ఆ ప్రాజెక్టుకు అనుమతులు వచ్చిందే 2021లో అని, 2022లో దాన్ని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించారని తెలిపారు. అనుమతులు వచ్చిన తర్వాత ఇంత భారీ మొత్తంలో ఖర్చుపెట్టడం సాధ్యం కాదన్నారు. అందుకే దాన్నికూడా తాము సవాల్ చేశామని తెలిపారు. అవతలివారు చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్నారన్న కారణంతో ఈ కేసును పక్కనపెట్టడానికి వీల్లేదన్నారు. ఈ ప్రాజెక్టు కేడబ్ల్యూడీటీ 1, 2లకు విరుద్ధంగా నిర్మిస్తున్నారని తెలిపారు. కేడబ్ల్యూడీటీ-2ని వ్యతిరేకిస్తూ దాఖలైన కేసును ఈ కోర్టు సమీక్షిస్తుందా? లేదా? అన్నది వేరే విషయమని, కానీ కేడబ్ల్యూడీటీ-1 అవార్డుకు వ్యతిరేకంగా ఈ ప్రాజెక్టును నిర్మిస్తున్నందునే తాము ఆర్టికల్ 131కింద సూట్ దాఖలు చేశామని, అందువల్ల దీన్ని వేరే వాటితో ముడిపెట్టకుండా స్వతంత్రంగా విచారించాలని కోరారు. కోర్టు ముందున్న ఇతర అప్పీళ్ల తీర్పులతో దీనికి సంబంధం లేదన్నారు. ఆ సమయంలో కర్ణాటక ప్రభుత్వం తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది శ్యాందివాన్ జోక్యం చేసుకుంటూ ఈ కేసును వివాదాస్పద అంశాల ఖరారు కోసం నాలుగు వారాల పాటు విచారణను వేయాలని, ఆ లోపు ఇరురాష్ట్రాలు సమస్యల ముసాయిదాలను పరస్పరం పంచుకుంటామని తెలిపారు. ఒకసారి అంశాలు ఖరారైన తర్వాత ఏయే దస్త్రాలు, సాక్ష్యాలు సమర్పించాలన్నది నిర్ణయించవచ్చని పేర్కొన్నారు. అందుకు ఏపీ ప్రభుత్వ తరఫు న్యాయవాది కూడా అంగీకరించడంతో న్యాయస్థానం తదుపరి విచారణను డిసెంబరు 11కు వాయిదా వేసింది. అదే సమయంలో కేడబ్ల్యూడీటీ-2 తీర్పును సవాల్ చేస్తూ తాము దాఖలుచేసిన సివిల్ అప్పీల్ 14 ఏళ్లుగా పెండింగ్‌లో ఉందని, జాప్యం లేకుండా దాన్ని కూడా విచారణకు స్వీకరించాలని కర్ణాటక తరఫు న్యాయవాది చేసిన విజ్ఞప్తిని కోర్టు పరిగణనలోకి తీసుకొంది. ఆ కేసునూ అదే రోజు విచారిస్తామని పేర్కొంది.

వర్గీకరణ అర్థరహితమంటూ ధర్నా

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : ఎలాంటి శాస్త్రీయ అధ్యయనం చేయకుండా ఏకపక్షంగా ఎస్టీ వర్గాల రిజర్వేషన్‌ను వర్గీకరించకూడదని డిమాండు చేస్తూ బెంగళూరు స్వాతంత్ర్య ఉద్యానవనంలో బంజార సంక్షేమ సంఘం సభ్యులు సోమవారం ధర్నాకు దిగారు. గిరిజనుల ఆర్థిక, సామాజిక పరిస్థితులను అధ్యయనం చేయాలని పట్టుబట్టారు. వారి సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని బంజార ధర్మగురువులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పూర్తి స్థాయిలో ఎస్టీల రిజర్వేషన్ అమలు అవసరాన్ని అధ్యయనం చేయాలని నినదించారు.

యువతుల సన్యాస దీక్ష

దావణగెరె, న్యూస్‌టుడే : వివాహ వయసుకు వచ్చిన ఇద్దరు యువతులు సన్యాస దీక్ష తీసుకునేందుకు సిద్ధమయ్యారు. ఎంఏ సైకాలజీ పూర్తి చేసిన మానసి కుమారి, బీఏ ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన భక్తి కుమారి ఇద్దరికీ 26 ఏళ్లే. తాము వివాహం చేసుకోకుండా జైన దీక్ష తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. నవంబరు 17న జార్ఖండ్‌లోని రుజుబాలికా తీర్థ క్షేత్రంలో ఆచార్య ముక్తిప్రభు సురీశ్వర్ మహారాజ్, సాధ్వి పూర్ణప్రజ్ఞ మహారాజ్ సమక్షంలో జైన దీక్ష తీసుకోనున్నారు. దీక్ష నేపథ్యంలో ఈ స్నేహితురాళ్లు ఇద్దరూ సోమవారం బంధువులు, స్నేహితులకు దావణగెరెలో ప్రత్యేక విందు భోజనాన్ని ఏర్పాటు చేశారు.



మానసి కుమారి, భక్తి కుమారి

విద్యార్థులకు ఏమిటీ పరీక్ష?

'సుప్రీం' ఆగ్రహం

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : వివిధ తరగతులకు అర్ధవార్షిక సంవత్సరం (హాఫ్ ఇయర్లీ) బోర్డు (పబ్లిక్) పరీక్షలు నిర్వహిస్తూ విద్యార్థులను వేధిస్తున్నారా అని రాష్ట్ర ప్రభుత్వాన్ని సర్వోన్నత న్యాయస్థానం తూర్పారబట్టింది. తదుపరి ఆదేశాల వరకు 5, 8, 9, 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన బోర్డు పరీక్షల ఫలితాలను ప్రకటించవద్దని జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ సతీశ్ చంద్రశర్మ పీఠం ఆదేశించింది. ఏ జిల్లాలోనూ ఈ తరహా పరీక్షలను నిర్వహించవద్దని తన ఆదేశాల్లో పేర్కొంది. 'విద్యార్థులను ఎందుకు వేధిస్తున్నారు? విద్యార్థులపై ఎందుకు కక్ష సాధిస్తున్నారు? 5, 8, 9 తరగతి విద్యార్థులకు బోర్డు పరీక్షల అవసరం ఏముంది?' అంటూ ప్రభుత్వ న్యాయవాది దేవదత్త కామత్‌పై పీఠం ప్రశ్నల వర్షాన్ని కురిపించింది. ఏడు జిల్లాల్లో ఇప్పటికే బోర్డు పరీక్షలను నిర్వహించారు. మిగిలిన 24 జిల్లాల్లో పరీక్షల నిర్వహణకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ పరీక్షలను రద్దు చేస్తూ ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయాన్ని తీసుకుందని పీఠానికి న్యాయవాది వివరించారు.



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య

మూడు స్థానాల్లో సీఎం సిద్ధరామయ్య జోస్యం
కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు తథ్యం

చెళ్లకెర, చిత్రదుర్గం, న్యూస్‌టుడే: విధానసభకు జరుగనున్న మూడు శాసనసభ నియోజకవర్గాల ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు తథ్యమని ముఖ్యమంత్రి ఎస్. సిద్ధరామయ్య జోస్యం చెప్పారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే రఘుమూర్తి కుమార్తె సుచిత్ర, వరుడు వరుణ్ వివాహానికి విచ్చేసిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజా మద్దతు ఉందన్నారు. చెన్నపట్టణ ఉప ఎన్నికల్లో జేడీఎస్, భాజపా అభ్యర్థిని ప్రకటించలేదంటూ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఒకటి, రెండు రోజుల్లో అభ్యర్థిని ఖరారు చేస్తుందన్నారు. సీపీ యోగీశ్వర్‌ను కాంగ్రెస్ పార్టీ తమ వైపు లాక్కొనడానికి ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదని, జేడీఎస్ పార్టీ నేతలు చేస్తున్న ఆరోపణలు సత్యదూరమన్నారు. తమ ప్రభుత్వాన్ని కూల్చడానికి రూ. వెయ్యి కోట్లు ఖర్చుపెడుతున్నారని భాజపా ఎమ్మెల్యే బసవరాజ్ యత్నాల్ చెబుతున్నారని, ఈ డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. ఇది అవినీతి డబ్బుకాక మరేమిటని సిద్ధు ప్రశ్నించారు. నల్లధనం కూడా అయిఉండవచ్చన్నారు. రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తుండటంతో సమస్యల పరిష్కారానికి ముందు జాగ్రత్తలు తీసుకొంటున్నట్లు సీఎం పేర్కొన్నారు. ఈ వర్షాలకు పెద్దగా పంట నష్టం వాటిల్లలేదన్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో బెంగళూరుతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయన్నారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, జిల్లా బాధ్యత మంత్రి డి. సుధాకర్, మంత్రి హెచ్.కె.పాటిల్, మాజీ మంత్రి ఆంజనేయలు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

సీఎం, డీసీఎంను కలిసిన అన్నపూర్ణ తుకారామ్

ఆమెకే టికెట్ కేటాయింపు?

బళ్లారి, న్యూస్‌టుడే: ఉప ఎన్నికల వేళ బళ్లారి జిల్లా సండూరు నియోజకవర్గం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ స్థానం నుంచి కాషాయ జెండా ఎగరవేయడానికి ప్రయత్నాలు ప్రారంభించింది. బంగారు హనుమంతుడు ఢీటుగా ఎదుర్కొనేది ఎంపీ ఇ.తుకారామ్ మాత్రమే అని ప్రజలు తెలుస్తు..ఆయన సతీమణి అన్నపూర్ణ తుకారామ్ పేరును తెరపైకి తీసుకొచ్చారు. తుకారామ్ సౌమ్యుడు, విద్యావంతుడు కావడంతో పాటు, నియోజకవర్గం ఓటర్లు నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించారు. ఒక సారి ఎంపీగా గెలిపొందించిన తన నియోజకవర్గానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుంటారు. మంత్రి సంతోష్ ఎస్.లాడ్ పూర్తి మద్దతు తుకారామ్ ఉన్నదనే కారణం గెలుపును తన భుజాలపై వేసుకున్నారు. ఇప్పటికే భాజపా అభ్యర్థిగా బంగారు హనుమంత పేరును పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మంగళవారం ప్రకటించే అవకాశాలు ఉన్నాయి. దీంతో టికెట్ ఆశిస్తున్న అన్నపూర్ణ తుకారామ్ సోమవారం బెంగళూరులో ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్‌ను వివిడిగా కలిసి రహస్యంగా చర్చించారు. అభ్యర్థి పేరు దాదాపు ఖరారు కావడంతో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కలిసినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. ఒకటి, రెండు రోజుల్లో ఖరారు చేస్తారని తెలిసింది.



ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్‌ను కలిసిన ఎంపీ తుకారామ్, సతీమణి అన్నపూర్ణ తుకారామ్

గుంతకల్లు-చిక్కజాజూరు రైలు సేవలు తాత్కాలిక నిలిపివేత

హొసపేటె, న్యూస్‌టుడే: చిత్రదుర్గ-చెళ్లకెర మధ్యలో రైలు పట్టాల పనులు చేపట్టిన నేపథ్యంలో గుంతకల్లు-చిక్కజాజూరు నడుమ సంచరించే ప్రయాణికుల రైలు(సంఖ్య:07585-86) సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు నైరుతి రైల్వే హుబ్బళ్లి విభాగం అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 22 నుంచి డిసెంబరు 13వరకు ఈ రైలు సంచారాన్ని నిలిపివేస్తున్నారు.

రెండు డెము రైళ్ల సంచారం నిలిపివేత

హొసపేటె, న్యూస్‌టుడే: సాంకేతిక సమస్యలతో రెండు డెము రైళ్ల సంచారాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నామని నైరుతి రైల్వే హుబ్బళ్లి విభాగం అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. బళ్లారి - దావణగెరె నడుమ సంచరించే రైలు (సంఖ్య:07396-97), హొసపేటె - బళ్లారి నడుమ సంచరించే రైలు (సంఖ్య:07398)లను ఈ నెల 22 నుంచి 24 వరకూ తాత్కాలికంగా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు.

జంగ్లి రంగాపుర విద్యార్థులకు బస్సు సౌకర్యం

గంగావతి,న్యూస్‌టుడే: రంగాపుర, అంజనళ్ళి, ముదు కమ్మ క్యాంప్, చిక్కరాంపుర గ్రామాల విద్యార్థుల కష్టాలు తీరాయి. బడికెళ్లాలంటే వీరు నాలుగైదు కిలోమీటర్లు నడిచి వెళ్లి చిక్కరాంపుర క్రాస్‌లో బస్సెక్కాలి. అక్కడి నుంచి ఆనెగుంది, గంగావతికి వెళ్లి చదువుకోవాలి. రహదారి ఇరుకుగా ఉండడంతో ఈ నాలుగు గ్రామాల మార్గంలో ఆర్టీసీ బస్సుల సేవలు లేవు. ఎన్నికల ప్రచారం సమయంలో విద్యార్థుల కష్టాలు తెలుసుకున్న గాలి జనార్దన్ రెడ్డి సొంతంగా బస్సు సౌకర్యం కల్పిస్తానని భరోసా ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం విశ్వభారతి కళానికేతన విద్యాసంస్థ తరపున సొంత డబ్బుతో మినీ బస్సును కొనుగోలు చేసి విద్యార్థుల రాకపోకలకు అవకాశం కల్పించారు. శాసన సభ్యుడు గాలి జనార్దన్‌రెడ్డి సతీమణి లక్ష్మీ అరుణ సోమవారం ఈ సేవలను ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి ఆమె ఆనెగుంది దాకా ప్రయాణించారు. బస్సు సేవల నిర్వహణ బాధ్యతలను సైతం తామే భరిస్తామని ఆమె చెప్పారు.



రంగాపుర, అంజనళ్ళి విద్యార్థులతో బస్సులో ప్రయాణిస్తున్న లక్ష్మీ అరుణ

ఘరానా దొంగ అరెస్టు

సింధనూరు, న్యూస్‌టుడే: సింధనూరు పోలీసులు సోమవారం ఓ దొంగ నుంచి భారీ మొత్తంలో బంగారం ఆభరణాలు, నగదు స్వాధీనం చేసుకుని ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకున్నారు. రాయచూరు జిల్లా ఎస్పీ పుట్టమాదయ్య సోమవారం సాయంత్రం స్థానిక టౌన్ పోలీసు స్టేషన్‌లో విలేకరులకు వివరించిన ప్రకారం..సికింద్రాబాదు టోకు బంగారం వ్యాపారి భరత్‌కుమార్ కమీషన్‌పై నగలు అమ్ముకొని రావాలని తన ఇద్దరు నమ్మకస్తులను 2 కిలోల అయిదు తులాల బంగారు ఆభరణాలను (విలువ రూ.1.44 కోట్లు) ఇచ్చి పంపారు. జతగా రూ. 40,150 నగదును ఇచ్చారు. ఇద్దరు నమ్మకస్తులు సర్వేశ్‌కుమార్ జైన్, నిర్మల్ కుమార్ జైన్ మూడు రోజుల కిందట సింధనూరు చేరుకుని స్థానిక జైన్‌మందిర్ సమీపంలోని ఓ అద్దె గది తీసుకుని విశ్రాంతి తీసుకున్నారు. ఇందులో సర్వేశ్‌కుమార్ జైన్ గుడికి వెళ్లొస్తానని ఉదయాన్నే బయటకు వెళ్లాడు. ఇదే అదనుగా చూసుకున్న రెండోవాడు నిర్మల్‌కుమార్ జైన్ మొత్తం నగలు, నగదు పట్టుకుని ఉడాయించాడు. రోజంతా వెతికి చివరికి విషయాన్ని సికింద్రాబాద్‌లోని తమ యజమాని భరత్‌కుమార్‌కు వివరించాడు..దీంతో లబోదిబోమంటూ సింధనూరు పోలీసులను ఆశ్రయించాడు. రంగంలోకి దిగిన పోలీసులు రెండు రోజులు గాలించి చివరికి దొంగ ఆచూకీ కనుగొన్నారు. మాన్విలోని ఓ లాడ్జిలో ఉన్నట్లు తెలుసుకుని కాపుగాచి సోమవారం పట్టుకున్నారు. మొత్తం సొత్తు స్వాధీనం చేసుకున్నారు.



స్వాధీనం చేసుకున్న సొత్తును చూపిస్తున్న జిల్లా ఎస్పీ, ఇతర అధికారులు

సురేశ్‌పై కుమార వ్యంగ్యాస్త్రాలు

మండ్య: మాజీ ఎంపీ డీకే సురేశ్ చెన్నపట్టణ ఉప ఎన్నికల్లో పోటీ చేసినా.. గెలుపు గుర్రం ఎక్కలేరని కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి వ్యాఖ్యానించారు. చెన్నపట్టణ నుంచి పోటీ చేస్తాను.. గెలిచి మంత్రి అవుతానని ఆయన తన సన్నిహితుల వద్ద ప్రచారాన్ని చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఐదేళ్ల పాటు కాంగ్రెస్ ప్రభుత్వం ఉండదని జోస్యం చెప్పారు. కుమార వ్యాఖ్యలను డీకే సురేశ్ తీవ్రంగా ఖండించారు. ఇప్పటి వరకు 18 నెలల పాలనను కాంగ్రెస్ పూర్తి చేసిందని, ఐదేళ్ల వరకు ప్రభుత్వానికి ఎటువంటి ఢోకా లేదన్నారు. 'ఎవరో లెక్కలు వేసుకుని ప్రభుత్వం పతనం అవుతుందని జోస్యం చెబుతారు. ప్రభుత్వాన్ని వారే కూల్చివేస్తారా?' అంటూ కుమారస్వామిని ఉద్దేశించి పరోక్ష వ్యాఖ్యలు చేస్తూ ప్రశ్నల్ని సంధించారు.

పోటీకి భరత్ అర్హుడే: బెల్లద్

హుబ్బళ్లి: శిగ్గావ్ ఉప ఎన్నికల్లో బసవరాజ్ బొమ్మై కుమారుడు భరత్‌కు టికెట్ ఇచ్చిన వెంటనే కుటుంబ, వారసత్వ రాజకీయాలు అని అనడం సరికాదని విధానసభలో విపక్ష ఉప నాయకుడు అరవింద్ బెల్లద్ వ్యాఖ్యానించారు. ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర, జాతీయ నాయకులు అన్ని అంశాలనూ పరిగణనలోకి తీసుకుని, సుదీర్ఘంగా చర్చించిన అనంతరమే భరత్‌కు టికెట్ ఇచ్చారని చెప్పారు. ఉప ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు అందరూ ఐకమత్యంతో పని చేస్తున్నామని తెలిపారు.

ప్రచారం ప్రారంభించిన భాజపా

ఇ.తుకారామ్ స్థానం ఊడిపోవడం కచ్చితం

బళ్లారి, న్యూస్‌టుడే: సండూరు అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికల ప్రచారం భాజపా ప్రారంభించింది. భాజపా అభ్యర్థి బంగారు హనుమంతతో కలిసి మాజీ మంత్రి, గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి ప్రచారాన్ని మొదలుపెట్టారు. సోమవారం కురుగోడు తాలూకా సండూరు నియోజకవర్గం వ్యాప్తిలోకి వచ్చే ఏళుబెంచి గ్రామంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి అభివృద్ధి మండలి నుంచి రూ.187 కోట్లు అక్రమంగా తీసుకుని, అందులో కొంత సొమ్మును లోక్‌సభ ఎన్నికల్లో ఖర్చు చేసి ఎంపీగా గెలుపొందిన ఇ.తుకారామ్ స్థానం కొద్ది రోజుల్లో ఊడిపోవడం కచ్చితమన్నారు. జిల్లా ఖనిజ నిధులు (డి.ఎం.ఎఫ్.) సింహభాగం సండూరు తాలూకాలకు కేటాయించారు. తుకారామ్ నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందినా నియోజకవర్గంలో అభివృద్ధి కనిపించడం లేదన్నారు. గ్రామాల్లో రహదారులు దుస్థితికి చేరుకున్నాయి. ఈ నియోజకవర్గం ఎస్టీ రిజర్వేషన్ అయినా ఇ.తుకారామ్ కుటుంబానికి పరిమితమైందని ఆరోపించారు. రాష్ట్రంలో అభివృద్ధి మరిచిపోయి ప్రభుత్వం గ్యారంటీలను ప్రవేశపెట్టిందని విమర్శించారు. ఈ ప్రాంతంలో భారీ పరిశ్రమలు రావాల్సి ఉంది. గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగాలు కల్పించాలనేది తన కోరిక అన్నారు. ఉప ఎన్నికల్లో భాజపా అభ్యర్థి బంగారు హనుమంతకు మద్దతు ఇవ్వాలని కోరారు. అభ్యర్థి బంగారు హనుమంత మాట్లాడుతూ ఈ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి ఓటు వేసి గెలిపించాలని మనవి చేశారు. భాజపా జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ మోకా, ఉపాధ్యక్షుడు జి.టి.పంపాపతి, ఐయాలి తిమ్మప్ప మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, పార్టీ నేతలు అంబణ్ణ, శంకర్‌దాస్, నానాసాబ్, నాగప్ప, ముద్దె హొన్నూరప్పస్వామి, చిదానంద, హేమయ్య పాల్గొన్నారు.



ఏళుబెంచి గ్రామంలో డోలు కొట్టి ప్రచారాన్ని ప్రారంభిస్తున్న గాలి జనార్దన్‌రెడ్డి, చిత్రంలో అభ్యర్థి బంగారు హనుమంత తదితరులు



ప్రచారంలో మాట్లాడుతున్న జనార్దన్‌రెడ్డి, పక్కన బంగారు హనుమంత

ఇద్దరు దొంగల పట్టివేత



వివరాలు అందిస్తున్న ఎస్పీ రామ్ అరసిద్ధి


గంగావతి,న్యూస్‌టుడే: యలబుర్గా పట్టణం రామనగర్‌లోని ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డ ఇద్దరు దొంగలను పోలీసులు సోమవారం బంధించారు. కొప్పళ ఎస్పీ రామ్ అరసిద్ధి విలేకరులకు వివరాలు అందించారు. ఈ నెల 8న జరిగిన చోరీలో నిందితులు రూ.19,50,000 నగదు, 160 గ్రాముల బంగారు బిస్కెట్లు దోచుకుని పరారయ్యారు. దొంగలను పట్టుకునేందుకు అదనపు ఎస్పీ హేమంత్‌కుమార్ నేతృత్వంలో బృందాన్ని ఏర్పాటు చేశారు. యాదగిరి జిల్లా సురపుర తాలూకా కెంబావికి చెందిన బీరప్ప(30), నాగరాజ్((35)లు చోరీకి పాల్పడినట్లు గుర్తించి వీరిని బంధించారు. నిందితులపై కేసు నమోదు చేసి న్యాయాంగ బంధనానికి అప్పగించామన్నారు. దొంగలను పట్టుకున్న పోలీసులను ఎస్పీ అభినందించార. డీవైఎస్పీ ముత్తణ్ణ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మౌనేశ్వర పాల్గొన్నారు.



భీరప్ప, నాగరాజ

ఆరోగ్య రక్షణకే ప్రాధాన్యం

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై దృష్టి సారించి క్రమం తప్పకుండా వైద్య, ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని ఆరోగ్య శాఖ మంత్రి దినేశ్ గుండూరావు పిలుపునిచ్చారు. సరైన పరిమాణంలో నీరు తాగకపోవడం, వైద్య పరీక్షలు చేయించుకునేందుకు ముందుకు రాకపోవడంతోనే మూత్రపిండాల వ్యాధులు ఎక్కువవుతున్నాయని వివరించారు. మూత్రపిండాల వ్యాధులపై అవగాహన కల్పించేందుకు 'ది కిడ్నీ వారియర్స్ ఫౌండేషన్' సిద్ధం చేసిన పుస్తకాన్ని కేంద్ర ఆరోగ్య శాఖ ప్రధాన సంచాలకుడు డాక్టర్ అతుల్ గోయల్‌తో కలిసి సోమవారం ఇక్కడ విడుదల చేసి మాట్లాడారు. దేశంలో ఆరోగ్య బీమా తక్కువ మందికి మాత్రమే ఉందన్నారు. బీమాతోనే ఖరీదైన వైద్య చికిత్సలను పొందే పరిస్థితి ఉందని గుర్తు చేశారు. కిడ్నీ వారియర్స్ పుస్తకం ద్వారా ప్రతి ఒక్కరిలో అవగాహన కల్పించేందుకు ప్రయత్నిస్తున్నానని రచయిత్రి, ఫౌండేషన్ సీఈఓ వసుంధర రాఘవన్ తెలిపారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దినేశ్ గుండూరావు

మాదవారకు నెలాఖరులో మెట్రో

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: నమ్మ మెట్రో తూర్పు- పడమటి నడవా పరిధిలో నాగసంద్ర- మాదాపుర మధ్య 3.4 కిలోమీటర్ల పొడిగింపు మార్గంలో మెట్రో రైలు సంచారం ఈనెలాఖరులో ప్రారంభిస్తారు. ఇప్పటికే రైలు సంచారానికి కేంద్ర మెట్రో రైలు సురక్షిత ప్రాధికార అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు ప్రారంభోత్సవానికి తేదీలు నిర్ణయించలేదని, ఆ వివరాలు నిర్ణయించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బీఎంఆర్‌సీఎల్ అధికారులు లేఖలు రాశారు. నెలాఖరులో ప్రారంభించేందుకు అనుమతించినట్లు అధికారులు తెలిపారు. పొడిగింపు మార్గంలో మూడు ప్రయాణ ప్రాంగణాలు నిర్మించారు. రైలు సంచారం ప్రారంభిస్తే తుమకూరు, నెలమంగల, బెంగళూరు అంతర్జాతీయ వస్తు ప్రదర్శన కేంద్రం తదితర ప్రాంతాలకు తక్కువ సమయంలో ప్రయాణికులు చేరుకోవచ్చు. నిత్యం సంచార రద్దీగా ఉండే తుమకూరు రహదారిలో పరిస్థితి అదుపులోకి వచ్చేందుకు కొత్త వ్యవస్థ ఉపకరిస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రారంభం కోసం ఆ ప్రాంతాల ప్రజలు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్నారు.

వంటింట్లో పేలిన గ్యాస్‌సిలిండర్

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: వంట గ్యాస్ సిలిండర్ పేలి వంటమనిషి గాయపడిన సంఘటన సోమవారం ఉదయం బెంగళూరు సుద్దగుంటెపాళ్య పోలీసుఠాణా పరిధిలో భయాందోళనలు సృష్టించింది. బీటీఎం లేఔట్ మొదటి స్టేజి మంజునాథ్ లేఔట్‌లో ఉత్తరప్రదేశ్ నివాసి పవన్ అద్దెకు ఉంటున్నాడు. సిలిండర్ ఖాళీ అవడంతో కొత్తది బిగించాడు. అది లీక్ కావడాన్ని గుర్తించలేకపోయారు. ఉదయం 8.30 గంటలకు పాలు కాసేందుకు స్టవ్ అంటించే సమయంలో సిలిండర్ పేలినట్లు పోలీసులు తెలిపారు. గోడ కూలిపోవడంతో పాటు ఇంట్లో ఉండే వస్తువులు చెల్లాచెదురైనట్లు వివరించారు. విషయం తెలిసిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు అక్కడికి వచ్చి పరిశీలించారు. ప్రమాదంలో వంట మనిషి తీవ్రంగా గాయపడ్డాడు.

హాసనాంబ వేడుకలకు సన్నాహాలు

హాసన, న్యూస్‌టుడే: హాసన నగర అధిదేవత హాసనాంబ జాతర మహోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రతి ఏటా ఆశ్వయుజ మాసం పూర్ణమి అనంతరం వచ్చే మొదటి గురువారం హాసనాంబ ఆలయం తలుపులు తెరుస్తారు. ఈ ఏడాది తొమ్మిది రోజులు మాత్రమే అమ్మవారిని దర్శించుకునేందుకు అవకాశం ఉంటుంది. ఈ ఏడాది కనీసం 20 లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారని అంచనా. ఉచిత దర్శనంతో పాటు రూ.300, రూ.1000 టికెట్లపై దర్శనాలకు అవకాశం కల్పిస్తున్నామని జిల్లా పాలన యంత్రాంగం తెలిపింది.



కోవెలలో కొలువుదీరిన హాసనాంబ


పోలీసుల సేవలు చిరస్మరణీయం

అమరవీరులకు నివాళి



బళ్లారి : మాట్లాడుతున్న ఐజీపీ లోకేష్‌కుమార్

బళ్లారి, న్యూస్‌టుడే: శాంతిభద్రతల పరిరక్షణ, కర్తవ్య నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ శాఖ అధికారులు, సిబ్బందిని స్మరించుకోవడం మనందరి ప్రథమ కర్తవ్యమని బళ్లారి పోలీస్ విభాగం ఐజీపీ బి.ఎస్.లోకేష్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పాత కోర్టు రహదారిలోని జిల్లా పోలీస్ క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఐజీపీ ప్రారంభించి మాట్లాడారు. దేశ రక్షణ, ప్రజాప్రయోజనాల కోసం అద్భుతమైన సేవలందిస్తూ సుస్థిర సమాజ నిర్మాణంలో పోలీసు అమరవీరుల సహకారం ఎంతో ఉందన్నారు. ఈ రోజు పోలీసుల అమరవీరులకు నివాళులర్పిస్తూ భవిష్యత్తులో పోలీసులు అమరవీరుల సంఖ్య తగ్గించాలన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది తమ కుటుంబసభ్యులతో ఆరోగ్యంగా ప్రశాంతంగా జీవనం సాగించాలని కోరారు. జిల్లా పాలనాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా మాట్లాడుతూ దేశాభివృద్ధికి అహర్నిశలు శ్రమించి, అంకితభావంతో పనిచేసిన పోలీసులు అమరవీరుల సేవలు మరవలేనివన్నారు. పోలీసులు విశ్వసనీయత, వారి త్యాగాలతోనే సమాజంలో శాంతి, ప్రశాంతత నెలకొందన్నారు. జిల్లా పోలీస్ అధికారి శోభారాణి మాట్లాడుతూ 1959 అక్టోబరు 21న సీఆర్‌పీఎఫ్ డీఎస్పీ కరణ్‌సింగ్ నేతృత్వంలో సీఆర్‌పీఎఫ్ బృందం లడఖ్‌లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో మందుగుండు సామగ్రి, ఆయుధాలతో చైనా సైనికులు పెద్ద ఎత్తున దాడి చేయడంతో భారత సైనికులు కూడా చైనా సైనికులతో పోరాడారు. ఈ పోరాటంలో 10 మంది సీఆర్‌పీఎఫ్ సైనికులు అమరవీరులు అయ్యారు. తొమ్మిది మంది చైనా సైనికులను బంధించారు. అప్పట్లో జవాన్ల ధైర్యసాహసాలు, ఆత్మబలిదానాలు నేటికీ భారతదేశ పౌరులందరూ గుర్తు చేసుకుంటున్నారు. వారి జ్ఞాపకార్థం స్మారక చిహ్నం ఏర్పాటు చేసి, ఏటా అక్టోబరు 21న పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ గుర్తుచేశారు. ఎస్పీ 2023-24 ఏడాదిలో దేశవ్యాప్తంగా పోలీస్ శాఖలో వీరమరణం పొందిన 219 మంది, కర్ణాటకలో 8 మంది సిబ్బంది, అధికారుల పేర్లను స్మరించుకున్నారు. అనంతరం పోలీసుల అమరవీరుల స్తూపంకు ఐజీపీ, డీసీ, ఎస్పీ, జడ్పీ సీఈవో, ఏఎస్పీలు రవికుమార్, నవీన్‌కుమార్, లోకాయుక్త ఎస్పీ సిద్ధరాజు, డీఎస్పీలు చంద్రకాంత నందరెడ్డి, ప్రసాద్ గోకులె, వెంకటేశులు, తిప్పేస్వామి, ఎన్జీవో అధ్యక్షుడు శివాజీరావ్ సీనియర్ పోలీస్ అధికారులు పోలీసులు నివాళులర్పించారు.



బళ్లారి : నివాళులు అర్పిస్తున్న ఎస్పీ శోభారాణి

పోలీసులది సవాళ్లతో కూడిన పని

హొసపేటె, న్యూస్‌టుడే: సాంకేతిక పరిజ్ఞానంతో జరిగే నేరాల సంఖ్య పెరిగింది. వాటిని పరిష్కరించడం పోలీసులకు సవాళ్లతో కూడిన పని అని జిల్లా అదనపు న్యాయస్థానం న్యాయమూర్తి అబ్దుల్ రహీమాన్ ఎ.నందగడి పేర్కొన్నారు. విజయనగర జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సోమవారం డి.ఎ.ఆర్. మైదానంలో ఏర్పాటు చేసిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సైబర్ నేరాల సంఖ్య బాగా పెరిగింది, నేరం జరిగిన వెంటనే సాక్ష్యాలు నాశనం చేస్తున్నారు. నేరాల నుంచి తప్పించుకోవటానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారని వివరించారు. అయినప్పటికీ పోలీసులు ఎంతో చాకచక్యంగా కొన్ని కేసులను పరిష్కరిస్తున్నారని అభివర్ణించారు. ఎస్పీ శ్రీహరిబాబు మాట్లాడుతూ..2023-2024వ సంవత్సరంలో దేశ వ్యాప్తంగా మొత్తం 231మంది పోలీసులు అమరవీరులయ్యారు. మన రాష్ట్రంలో ఐదుగురు పోలీసులు వృత్తినిర్వహణలో కన్నుమూశారని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సలీంపాషా, డీఎస్పీలు టి.మంజునాథ్, వెంకటప్పనాయక తదితరులు పాల్గొని పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు.



బళ్లారి : అమరవీరులకు నివాళులర్పిస్తున్న పోలీసులు



బళ్లారి : మాట్లాడుతున్న డీసీ ప్రశాంత్‌కుమార్ మిశ్రా



మాట్లాడుతున్న జిల్లా అదనపు న్యాయస్థానం న్యాయమూర్తి అబ్దుల్ రహీమాన్ ఎ.నందగడి



హొసపేటెలో పాల్గొన్న జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది

బళ్ళారి
•బళ్ళారి •రాయచూరు

రంగస్థల కళలకు ప్రోత్సాహం అవసరం


బయలు నాటకంలో పాత్రధారుల ప్రదర్శన

చెళ్లకెర, న్యూస్‌టుడే: పూర్వ కాలం నుంచి ప్రజల మన్ననలను పొంది నేడు ప్రోత్సాహం లేక రంగస్థల కళలు అవసాన దశకు చేరుకొన్నాయని రాష్ట్ర బయలు నాటక అకాడమీ అధ్యక్షుడు దుర్గాదాస్ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి ఇక్కడ బిసినీరు మద్దప్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆటల మైదానంలో ఏర్పాటు చేసిన కరెబంటు వధ పౌరాణిక బయలు నాటకాన్ని ప్రారంభించి మాట్లాడారు. టీవీ ఛానళ్లు, చరవాణుల పోటీ యుగంలో జిల్లాలో బయలు నాటకాలు ప్రదర్శించడం హర్షణీయమన్నారు. కళాకారులకు రూ.25 వేలను ప్రోత్సాహ ధనంగా అందించారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.పి. భూతయ్య, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తేనే విజయం

రాయచూరు, న్యూస్‌టుడే: రాయచూరులో ఈ ఏడాది చివర్లో నిర్వహించనున్న దళిత సాహిత్య పరిషత్ రాష్ట్ర సమ్మేళనం విజయవంతానికి ఇప్పటి నుంచే శ్రమించాలని రాష్ట్రాధ్యక్షుడు డాక్టర్ అర్జున్ గోళసంగి కోరారు. స్థానిక ప్రభుత్వ ఉద్యోగుల సంఘం భవనంలో సోమవారం సన్నాహక సమావేశం జరిగింది. అధ్యక్షత వహించిన అర్జున్ మాట్లాడుతూ సమ్మేళనం నిర్వహణకు నియమించిన వివిధ సమితిలు సమన్వయంతో కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. బుద్ధుడు, బసవేశ్వరుడు, అంబేడ్కర్ ఆలోచనలపై విస్తృతంగా చర్చిస్తారన్న అంశాన్ని బాగా ప్రచారం చేయాలన్నారు. పరిషత్ జిల్లా అధ్యక్షుడు తాయరాజ్ మర్చటాల్‌ను సమ్మేళనం సంయోజకుడిగా, సింధనూరు తాలూకా అధ్యక్షుడు డాక్టర్ హుస్సేనప్పను సహ సంయోజకుడిగా నియమించినట్లు ఆయన వెల్లడించారు.

రేపు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

బళ్లారి, న్యూస్‌టుడే: సిరుగుప్ప జెస్కాం వ్యాప్తిలోని 110/11 కె.వి. విద్యుత్తు కేంద్రంలో మరమ్మతులు జరుగుతుండటంతో ఈ నెల 23న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఎదురవుతుందని జెస్కాం అధికారి తెలిపారు. కేంద్రం వ్యాప్తిలోకి వచ్చే సిరుగుప్ప పట్టణంలోని ఆదోని రహదారి, పారిశ్రామిక ప్రాంతంలో సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

యువకవి గోష్ఠికి కవితల ఆహ్వానం

బళ్లారి, న్యూస్‌టుడే: కర్ణాటక సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో కర్ణాటక సంభ్రమ-50 అభియాన్‌ను పురస్కరించుకుని యువ కవిగోష్ఠిని నిర్వహించనున్నాయి. ఆసక్తి గల కవులు తమ కవితలను ఈ నెల 30లోపు ఆన్‌లైన్‌లో పంపాలని నిర్వాహకులు కోరారు. ఒక్కొక్కరు మూడు కవితలు మాత్రమే ఉండేలా చూసుకోవాలి. మరింత సమాచారం కోసం కర్ణాటక సాహిత్య అకాడమీ రిజిస్ట్రార్ కరియప్పను సంప్రదించాలని కోరారు.

వాలీబాల్ క్రీడలో విభాగ స్థాయికి ఎంపిక


కలబురగి విభాగ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కారటగి, న్యూస్‌టుడే: కారటగి శరణ బసవేశ్వర ఆంగ్ల మాధ్యమ ప్రాథమిక పాఠశాల బాలురు వాలీబాల్ క్రీడలో కలబురగి విభాగ పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయి పోటీలో ప్రథమ స్థానంలో నిలిచి విభాగ పోటీలకు అర్హత సాధించారు. విద్యార్థులను పాఠశాల ఆవరణలో సోమవారం అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు మహంతేశ గద్ది, ఉపాధ్యాయులు, విద్యా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

వాల్మీకి, దళిత ఓటర్లపై పార్టీల గురి

● సండూరు ఉప ఎన్నికల్లో కీలక భూమిక వారిదే ● ప్రసన్నం చేసుకుంటున్న పార్టీల నేతలు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి జిల్లా సండూరు అసెంబ్లీ నియోజకవర్గానికి త్వరలో జరిగే ఉప ఎన్నికల్లో వాల్మీకి, దళిత ఓటర్లు కీలకంగా మారారు. ఈ సముదాయం ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి వివిధ పార్టీల నేతలు ప్రయత్నాలు ప్రారంభించారు. బళ్లారి జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా వాటిలో బళ్లారి అసెంబ్లీ నియోజకవర్గం మాత్రమే జనరల్‌కు కేటాయించారు. బళ్లారి గ్రామీణ, సిరుగుప్ప, కంప్లి, సండూరు అసెంబ్లీ నియోజకవర్గాలు ఎస్టీ (గిరిజన)కి రిజర్వు చేశారు. ఈ నియోజకవర్గంలో అభ్యర్థులు గెలుపోటములను నిర్దేశించేది దళిత, వాల్మీకి ఓటర్లు కావడం గమనార్హం.

సముదాయం వారీగా బలాలు

సండూరు నియోజకవర్గం ప్రకృతి సంపదకు నిలయం... ఈ నియోజకవర్గంలో గని కార్మికులు, జిందాల్‌తో పాటు ఇతర పరిశ్రమల ఉద్యోగులు, సిబ్బంది సింహ భాగం ఉన్నారు. నియోజకవర్గంలో మొత్తం 2,36,100 మంది ఓటర్లు ఉండగా, వారిలో పురుషులు-1,17,789, మహిళలు-1,18,282 మంది, ఇతరులు 29 మంది ఉన్నారు. పురుషుల కంటే మహిళలు 493 మంది అధికంగా ఉన్నారు. వీరిలో వాల్మీకి సముదాయం-59,312 మంది, దళితులు-41,676 మంది, కురుబ సముదాయం-24,701, ముస్లిం-24,588 మంది లింగాయత సముదాయం 30,024, వెనకబడిన వర్గాలు-41,506 మంది, ఇతరులు 15వేల మంది ఉన్నారు. 2023లో జరిగిన విధానసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు-85,223, భాజపా-49,701, జేడీఎస్-2617, కేఆర్‌పీపీకి 31,375 ఓట్లు పడ్డాయి.


ఎమ్మెల్యేల ప్రస్థానం ఇలా..

బళ్లారి జిల్లాలోని సండూరు అసెంబ్లీ నియోజకవర్గం రాజవంశస్తులైన ఎం.వై.ఘోర్పడే గడ్డగా పేరుపొందింది. 1957 నుంచి 1999 వరకు ఎం.వై.ఘోర్పడే బలపరిచిన వారికే ఇక్కడి ఓటర్లు పట్టం కట్టారు.

● 2004 నుంచి శివాజీరావ్ కుమారుడు సంతోష్ ఎస్.లాడ్‌కు కంచుకోటగా మారింది. మొదటి సారి 1957లో జరిగిన ఎన్నికల్లో రాయనగౌడ, 1959లో జరిగిన ఉప ఎన్నికల్లో ఎం.వై.ఘోర్పడే గెలుపొంది రాజకీయ విశ్రాంతి తీసుకుంటున్నట్లు ప్రకటించే వరకు ఓటర్లు ఆశీర్వదించారు.

● 1983లో హిరూజ్ వి.ఎస్.లాడ్, 1985లో సీపీఐ నుంచి యు.భూపతి పోటీ చేసి ఎం.వై.ఘోర్పడే మద్దతుతో గెలుపొందారు. 1999లో చివరిగా ఎం.వై.ఘోర్పడే పోటీ చేసి గెలుపొందారు. అనంతరం రాజకీయ విశ్రాంత తీసుకున్నట్లు ప్రకటించారు. 2004లో జరిగిన ఎన్నికల్లో రాజకీయ ప్రవేశం చేసిన సంతోష్ ఎస్.లాడ్ జేడీఎస్ నుంచి పోటీ చేసి గెలుపొంది, అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరారు.

● 2008లో ఈ స్థానం ఎస్టీకి రిజర్వు కావడంతో ఇ.తుకారామ్ వరుసగా 2008, 2013, 2018, 2023లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2024లో లోక్‌సభకు పోటీ చేసి, గెలుపొందడటంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ ఎన్నికల్లో భాజపా సండూరు నియోజకవర్గంలో జెండా ఎగురవేయడానికి ప్రయత్నాలు ప్రారంభించింది. ఓటర్లు కమలానికి మద్దతు ఇస్తారా? కాంగ్రెస్ పార్టీకి మరోసారి పట్టం కడతారా అనేది జిల్లానే కాదు, రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయంశమైంది. సండూరు నియోజకవర్గం ఉప ఎన్నిక హైవోల్టేజ్ విషయంగా మారింది.


సండూరు అటవీ అందాలు

కొప్పళ వార్తాధికారిగా సురేశ్


కొప్పళ వార్తాధికారి సురేశ్‌కు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

గంగావతి, న్యూస్‌టుడే: కొప్పళ జిల్లా వార్తాధికారిగా జి.సురేశ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బీదర్ జిల్లాలో సేవలు అందిస్తున్న ఆయనను ప్రభుత్వం ఇక్కడికి బదిలీ చేసింది. కొప్పళలో సేవలు అందించిన గవిసిద్దప్పకు రాయచూరుకు బదిలీ అయింది. సమాచార, ప్రచారశాఖ సిబ్బంది నూతన వార్తాధికారికి స్వాగతం పలికారు.

ఆరోవిడత గాలికుంటు వ్యాధి అభియాన ప్రారంభం


శ్రీరామనగర్ పశువుల ఆసుపత్రిలో గాలికుంటు వ్యాధి పోస్టర్లను ప్రదర్శిస్తున్న దృశ్యం

శ్రీరామనగర్, న్యూస్‌టుడే: పశువులకు ఆరో విడత గాలికుంటు వ్యాధి చికిత్స అభియాన సోమవారం ప్రారంభమైంది. శ్రీరామనగర్ పశువుల ఆసుపత్రిలో ప్రభుత్వ పంచ గ్యారంటీ పథకాల అనుష్టాన సమితి జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం వచ్చే నెల 20 వరకు కొనసాగుతుంది. రైతులు ముందు జాగ్రత్తగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ చుక్కలు వేయించాలని సూచించారు. ఆసుపత్రి వైద్యుడు అరుణ్ గురు, సిబ్బంది కొండయ్య, ప్రసాద్, పశు సఖి సుశీల, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులూ ఆరోగ్యం జాగ్రత్త


పౌరసత్వ శిబిరాన్ని ప్రారంభిస్తున్న బి.ఇడి విద్యార్థులు, చిత్రంలో వి.వి.సంఘం సభ్యులు, ప్రధాన ఆచార్యులు, అధ్యాపకులు

బళ్లారి, న్యూస్‌టుడే: ఆరోగ్యమే మహాభాగ్యం.. మూడు రోజుల శిబిరం... 30 సంవత్సరాలు ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంది. చదువుతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని బళ్లారి వీరశైవ విద్యావర్ధక సంఘం అధ్యక్షుడు అల్లం గురుబసవరాజు విద్యార్థులకు సూచించారు. బళ్లారి కొట్టూరు శిక్షణ మహావిద్యాలయం ఆధ్వర్యంలో బళ్లారి తాలూకా చెళ్లగుర్కి ఎర్రితాత మఠం సమీపంలో పౌరసత్వ శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాబోయే ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గదర్శకులుగా ఉండాలి. చదువుతో పాటు మానవ విలువలు చాలా ముఖ్యమన్నారు. మూడు రోజులపాటు నిర్వహించే శిబిరాన్ని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వి.వి.సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే వివిధ కార్యక్రమాలను వివరించారు. వి.వి.సంఘం కార్యదర్శి డా.అరవింద్ పాటిల్ మాట్లాడుతూ ప్లాస్టిక్ ఉపయోగం సమాజంలో పెనుభూతంగా మారింది. ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ శ్రమించాలన్నారు. కళాశాల ప్రధాన ఆచార్యుడు డా.సతీష్ హిరేమఠ్ మాట్లాడుతూ కొట్టూరు శిక్షణ మహావిద్యాలయానికి రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు ఉందని వివరించారు. చెళ్లగుర్కి ఎర్రితాత మఠం ప్రముఖులు బాలనగౌడ, అధ్యాపకులు సురేశ్‌బాబు, మల్లికార్జున, చంద్రకాంత్ హిరేమఠ్, జయణ్ణ పాల్గొన్నారు.

చెరువులు నిండితేనే అన్నదాతకు ఆనందం


యంత్రాలకు పూజలు చేస్తున్న శాసనసభ్యుడు హెచ్.ఆర్.గవియప్ప

హొసపేటె, న్యూస్‌టుడే: సరైన సమయంలో వర్షాలు కురిసి చెరువులు నిండితేనే అన్నదాతకు, పాడిపశువులకు ఆనందమని స్థానిక శాసనసభ్యుడు హెచ్.ఆర్.గవియప్ప పేర్కొన్నారు. చిన్ననీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో తాలూకాలోని పాపినాయకనహళ్లి, వడ్డరహళ్లి చెరువులు నింపే పథకాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ముంగారులో ఆశాదాయకంగా వర్షాలు కురిశాయి. తాలూకాలోని చెరువులకు జలకళ వచ్చిందని హర్షం వ్యక్తం చేశారు. నీటికొరత ఉన్న పాపినాయకనహళ్లి, వడ్డరహళ్లి చెరువులకు తుంగభద్ర నది నుంచి నీటిని తోడేసి నింపుతున్నామని వివరించారు. ఈ సందర్భంగా యంత్రాలకు ప్రత్యేక పూజలు చేశారు. సహాయక కమిషనర్ వివేకానంద, తహసీల్దార్ శ్రుతి మళ్లప్పగౌడ, నీటిపారుదల శాఖ ఇంజినీర్ ధర్మరాజ్ పాల్గొన్నారు.

పరిహారం చెల్లింపునకు 15 రోజుల గడువు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం అధ్యక్షుడు జె.ఎన్.కాళిదాస్

హొసపేటె, న్యూస్‌టుడే: ప్రకృతి వైపరీత్యంతో జరిగిన పంటనష్టానికి సంబంధించి మరో 15 రోజుల్లో రైతులకు పరిహారం చెల్లించకపోతే జిల్లా పాలనాధికారి కార్యాలయాన్ని ముట్టడిస్తామని కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం, హరిత సేన జిల్లాధ్యక్షుడు జె.ఎన్.కాళిదాస్ తెలిపారు. సోమవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మే నెలలో తాలూకాలో సుమారు 208 హెక్టార్ల అరటిపంట నేలకొరిగింది, ఇప్పటివరకూ పరిహారం చెల్లించలేదని వాపోయారు. ఈ నెల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో సుమారు 227 హెక్టార్లలో పలు పంటలు దెబ్బతిన్నాయి. వాటి గురించి అధికారులు ఊసెత్తడంలేదని దుయ్యబట్టారు. నేడు, రేపు అని తహసీల్దార్ కార్యాలయం వారు రైతులను తిప్పుతున్నారని విమర్శించారు. దీపావళి పండగ తరువాత ఉద్యమం తీవ్రం చేస్తామని హెచ్చరించారు. ప్రముఖులు మల్లికార్జున, హేమరెడ్డి, మహంతేశ్, రుద్రప్ప, జ్యోతి కొట్రప్ప, నల్లాపుర హనుమంతప్ప పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలు


వరిలో తెగుళ్లు, పురుగుల నియంత్రణ గురించి రైతులకు వివరిస్తున్న వ్యవసాయ సిబ్బంది

కారటగి, న్యూస్‌టుడే: గత కొన్ని రోజులుగా కురిసిన వర్షంతో వరి పంటకు పురుగులు, తెగుళ్లు ఆశించాయి. ఈ విషయమై కారటగి రైతు సంపర్క కేంద్రం అధికారులు, సిబ్బంది సోమవారం తాలూకాలోని యరడోణ, బూదగుంప, హాల సముద్ర, మర్లానహళ్లి తదితర గ్రామాల్లో పర్యటించి వరిలో సస్యరక్షణ చర్యల గురించి రైతులకు వివరించారు. రైతు సంపర్క కేంద్రం అధికారి ఆర్.నాగరాజ్ మాట్లాడుతూ ఎండ లేక వాతావరణం మబ్బుగా ఉండడం, వర్షం కురవడంతో వరి పంటకు పురుగులు, తెగుళ్ల బెడద అధికమైంది. వాటి నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఏదైనా సమస్య ఉంటే నేరుగా రైతు సంపర్క కేంద్రానికి వచ్చి సంప్రదించాలని రైతులకు సూచించారు. సిబ్బంది దీప, మురడప్ప, కృషి సంజీవిని ప్రతినిధులు పాల్గొన్నారు.

కన్నడ జ్యోతి రథానికి ఘన స్వాగతం


కంప్లిలో కన్నడ జ్యోతి రథానికి స్వాగతం పలికిన ఎమ్మెల్యే గణేశ్, అధికారులు తదితరులు

కంప్లి, న్యూస్‌టుడే: కురుగోడు నుంచి వచ్చిన కన్నడ జ్యోతి రథానికి తాలూకాలోని ఎమ్మిగనూరులో అధికారులు, నాయకులు సోమవారం ఉదయం ఘన స్వాగతం పలికారు. కన్నడ మాత భువనేశ్వరి దేవికి పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మిగనూరు నుంచి రథయాత్ర నెల్లుడి కొట్టాలు మీదుగా కంప్లి పట్టణానికి చేరుకుంది. పట్టణంలో రథానికి ఎమ్మెల్యే గణేశ్, తహసీల్దార్ శివరాజ్, డిప్యూటీ తహసీల్దార్ రవీంద్ర కుమార్, తాలూకా పంచాయతీ అధికారి శ్రీకుమార్, పురసభ ముఖ్యాధికారి దురుగణ్ణ, హేమయ్య స్వామి, కన్నడ సాహిత్య పరిషత్ ప్రతినిధులు, రైతు నాయకులు తదితరులు స్వాగతం పలికారు.

చిరు వ్యాపారుల జోలికెళ్లకండి

సింధనూరు, న్యూస్‌టుడే: పొట్టపోసుకోడానికి వ్యాపార స్థలం చూపించకుండా పట్టణంలోని పాదచారి మార్గంలో ఉన్న దుకాణాలను ఖాళీ చేయిస్తే సహించేది లేదు.. తీవ్ర స్థాయిలో పోరాటం చేస్తామని కర్ణాటక రక్షణా వేదిక నాయకులు నగరసభను హెచ్చరించారు. పట్టణ ప్రధాన రహదారుల్లోని పాదచారి మార్గంలో అనుమతి లేకుండా విస్తరించిన వ్యాపార దుకాణాలు మూడు రోజుల్లో ఖాళీ చాయాలని, లేకుంటే మేమే దగ్గరుండి ఖాళీ చేయిస్తామని నగరసభ వ్యాపారులకు తాఖీదులు అందించింది. మూతవేసి ఉన్న దుకాణాలకు తాఖీదులు అతికించింది. దీంతో రక్షణ వేదిక సోమవారం పోరాటానికి దిగింది. పాదచారి మార్గం వ్యాపారులకు మద్దతుగా నిలిచింది. ఈ మేరకు నిరసన ప్రదర్శన చేసి కమిషనర్‌కు వినతిపత్రం అందించింది. నాయకులు గంగణ్ణ, రామకృష్ణ భజంత్రీ పాల్గొన్నారు.


నగరసభ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న కరవే నాయకులు

జోరు వర్షం...లోతట్టు ప్రాంతాలు జలమయం

చెళ్లకెర (చిత్రదుర్గం), న్యూస్‌టుడే: చెళ్లకెర తాలూకాతో పాటు పొరుగున ఉన్న మొళకాల్మూరు, హిరియూరు, హొసదుర్గం తదితర తాలూకాల్లో 15 రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. కుంటలు, చెరువులు నీటితో కళ కళలాడుతున్నాయి. పలు దశాబ్దాల తర్వాత పలు చెరువులు భర్తీ అయ్యాయి. సోమవారం వర్షాలు కొనసాగాయి. వందలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. తళకు చెరువు భర్తీ కావడంతో వరద నీరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణను చుట్టుముట్టింది. ఉపాధ్యాయులు, పిల్లలు పాఠశాల గదుల్లోకి ప్రవేశించలేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మైనమైనహట్టి చెరువు నిండి మరవ వరద నీరు చెళ్లకెర నాయకనహట్టి రహదారిపై ప్రవహించడంతో వాహనాల సంచారానికి ఇబ్బందులు కలిగాయి. నాయకనహట్టి చిన్న చెరువు పూర్తిగా నిండటంతో మరవ పోతోంది. నీటిని చూడటానికి గ్రామాల ప్రజలు చెరువు వద్దకు చేరుకొంటున్నారు.


తళకు చెరువు నిండి ప్రభుత్వ పాఠశాల ఆవరణను చుట్టుముట్టిన వరద


నాయకనహట్టి చిన్న చెరువు మరవ పారడంతో చూడటానికి వచ్చిన గ్రామ ప్రజలు

రక్తదానం ఆరోగ్యదాయకం

రాయచూరు, న్యూస్‌టుడే: రక్తాన్ని ఇస్తే ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తవని డీహెచ్ఓ డాక్టర్ సురేంద్రబాబు అన్నారు. జిల్లా యంత్రాంగం, నవోదయ ఆసుపత్రి, రోటరీ, లయన్స్ క్లబ్, ఎస్.కె.ప్యారా మెడికల్ కళాశాల, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలోసోమవారం ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని జరిపారు. ఈ సందర్భంగా డీహెచ్ఓ కార్యాలయం వద్ద చేపట్టిన జాతాను సురేంద్ర బాబు పచ్చజెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. సకాలంలో రక్తమందితే ఎంతోమంది ప్రాణాలు కాపాడవచ్చన్నారు. రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులకు రక్తం కోసం కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతుంటారని, కావాల్సినంత అందుబాటులో ఉంటే చికిత్సను వేగంగా అందించవచ్చన్నారు. రోగులను రక్షించేందుకు వైద్యుడు ఎంత ముఖ్యమో దాతల పాత్ర అంతేనన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని స్వచ్ఛందంగా రక్తదానానికి యువత ముందుకు రావాలని కోరారు. జిల్లా సర్జన్ డాక్టర్ విజయశంకర్ మాట్లాడుతూ దాతలు ముందుకొచ్చేలా ప్రేరణ కలిగించాలని కోరారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రాణాధికారి డాక్టర్ షాకీర్, రిమ్స్ ప్రిన్సిపల్ బసవరాజ్ పాటిల్, మానసిక వైద్యుడు మనోహర్ పత్తార్, వైద్యాధికారులు యశోద, ప్రజ్వల్, ఆరోగ్య శిక్షణాధికారి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ధర్మస్థల గ్రామాభివృద్ధి సేవలు ప్రశంసనీయం


జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

కారటగి, న్యూస్‌టుడే: ధర్మస్థల గ్రామాభివృద్ధి యోజన సేవలు ప్రశంసనీయమని కారటగి హిరేమఠ మరుళ సిద్ధయ్య స్వామి ప్రశంసించారు. తాలూకాలోని మర్లానహళ్లి లక్ష్మీ వేంకటేశ్వర కల్యాణ మంటపంలో సోమవారం జరిగిన కారటగి, కనకగిరి తాలూకాల ధర్మస్థల గ్రామాభివృద్ధి యోజన ప్రగతి బంధు, స్వసహాయ సంఘాల సమాఖ్య ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు గ్రామాభివృద్ధి యోజన పథకాలు ఆర్థిక శక్తిని ఇస్తున్నాయన్నారు. మద్య విముక్త శిబిరం, అనాథలు, దివ్యాం గులకు పింఛను, విద్యార్థులకు ఉపకార వేతనం, తదితర ఎన్నో పథకాలు ఉన్నాయన్నారు. గ్రామాభివృద్ధి యోజన కొప్పళ జిల్లా నిర్దేశకుడు ప్రకాశరావు యోజన వివిధ పథకాలను వివరించారు. జిల్లా జన జాగృతి సభ్యులు ఎం.సుబ్బారావు, సిద్ధణ్ణ జక్కలి, ఎస్‌బీఐ అధికారిణి ఉమా హిరేమఠ, తాలూకా యోజనాధికారి నింగప్ప అగసర, శివకుమార్, శరణ బసవ, రేణుక పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: రుద్రాక్ష మాలలను తయారు చేయడానికి అవసరమైన కలప దుంగలను చెట్ల నుంచి తేవడానికి పోయిన ఇద్దరు మధ్యప్రదేశ్‌కు చెందిన యువకులు విద్యుదాఘాతంతో మృతి చెందిన సంఘటన ఆదివారం హిరియూరు తాలూకా కృష్ణాపురం గ్రామం వద్ద వక్క తోటలో జరిగిందని పోలీసులు తెలిపారు. సోమవారం వారు అందించిన వివరాల మేరకు.. మధ్యప్రదేశ్‌కు చెందిన మోహిత్ (24), ఆకర్‌లాల్ (32) తమ కుటుంబాలతో సమేతంగా రాష్ట్రానికి వలస వచ్చారు. వారు ధర్మపురం వద్ద తాత్కాలికంగా టెంట్లను వేసుకొని నివాసం ఏర్పరుచుకొన్నారు. వారు రుద్రాక్ష మాలలను తయారు చేసి విక్రయిస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. ఆదివారం రుద్రాక్ష మాలల తయారీకి అవసరమైన కలప దుంగలను సేకరించుకొని రావడానికి రంపం, గొడ్డలి, కొడవలి, గడ్డపార తదితర వస్తువులను తీసుకొని బయలు దేరారు. దారి మధ్యన వక్క తోటలో వెళ్తుండగా వారు పట్టుకొన్న ఇనుప వస్తువులు విద్యుత్తు తీగలను తాకడంతో విద్యుదాఘాతానికి గురై ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు.

శ్రమదానంతో ఉద్యానవనం పరిశుభ్రం

బళ్లారి, న్యూస్‌టుడే: బుడా కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న స్వాతంత్ర్య సమర యోధుడు టేకూరు సుబ్రహ్మణ్యం ఉద్యానవనాన్ని అంద్రాళ్ సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం శ్రమదానంతో శుభ్రం చేశారు. ఇక్కడ ఉదయం నడక, జిమ్ పరికరాలు వద్ద వ్యాయామం చేయడానికి వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై బుడాకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో అంద్రాళ్ సేవా సంఘం అధ్యక్షుడు ఆర్.వెంకటరెడ్డి నేతృత్వంలో స్థానికులు శుభ్రం చేశారు. ఫుట్‌పాత్‌పై పేరుకుపోయిన వ్యర్థాలు, జిమ్ పరికరాల చుట్టూ పడిన చెత్తాచెదారం శుభ్రం చేశారు. పిచ్చి మొక్కలను తొలగించారు. శ్రమదానంలో పలువురు సభ్యులతో పాటు యువకులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు.


జిమ్ పరికరాలు వద్ద పిచ్చి మొక్కల తొలగింపు


ఫుట్‌పాత్‌లను శుభ్రం చేస్తున్న దృశ్యం

అబాకస్ పోటీల్లో సత్తా



కప్ అందుకుంటున్న అన్విత

రాయచూరు: బ్రైనోబ్రైన్‌ఫెస్ట్ అంతర్జాతీయ స్థాయి అబాకస్ 44వ పోటీల్లో పట్టణానికి చెందిన విద్యార్థిని అన్విత హళ్లి ప్రథమ ఛాంపియన్‌గా నిలిచారు. ఈ నెల 19, 20వ తేదీల్లో తమిళనాడు రాష్ట్ర రాజధాని చెన్నైలో నిర్వహించిన పోటీల్లో దేశ, విదేశాలకు చెందిన పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. అన్విత వేగంగా సంఖ్యలను గుర్తించడంతో ప్రథమ విజేతగా ఎన్నికైనట్లు నిర్వాహకులు ప్రకటించి కప్ అందజేశారు. రాయచూరులోని విద్యాభారతి సీబీఎస్ఇ పాఠశాలలో అన్విత నాలుగో తరగతి చదువుతోంది. ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు. విద్యార్థిని తండ్రి డాక్టర్ బసవరాజహళ్లి పట్టణంలో పేరుగాంచిన దంత వైద్యుడు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

21-10-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1631.91	1611.77
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	29,516	66
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	29,336	9,887
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.421	41.180

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

అగ్ని ప్రమాదాలపై అవగాహన

మాన్వి,న్యూస్‌టుడే: అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ కనీస అవగాహన కలిగి ఉండాలని స్థానిక అగ్నిమాపక ఠాణాధికారి రంగప్ప అన్నారు. స్థానిక ప్రభుత్వ పరిశ్రమల శాఖ తర్ఫీదు కార్యాలయంలో సోమవారం ఐటీఐ కళాశాల విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే ఆ శాఖ దళానికి సమాచారం ఇవ్వాలని చెప్పారు. దీనివల్ల జరగబోయే భారీ ప్రమాదాలు, ప్రాణనష్టాన్ని నివారించవచ్చన్నారు. ప్రమాద స్థలిలో గ్యాస్, రసాయనాలు, విద్యుత్తు పరికరాలను దూరంగా ఉంచాలన్నారు. అగ్ని ప్రమాదాన్ని నిలువరించే పరికరాలను అమర్చుకోవడం ద్వారా నష్టాన్ని తగ్గించవచ్చన్నారు. వేసవిలోనే అధికంగా ప్రమదాలు జరుగుతాయన్నారు. ముఖ్యంగా గుడిసెలు, దూళ్లపాకలు, పత్తి, ధాన్యం రాసులు, గడ్డివాములను అగ్నికి దూరంగా ఉంచాలన్నారు. ఈ సందర్భంగా ఫైరింజిన్లతో అగ్ని ప్రమాదాలను ఎలా నిలువరించ వచ్చో ప్రత్యక్షంగా చూపించారు. అగ్నిమాపక శాఖ సహాయక అధికారి హాజిమిమా, ప్రభుత్వ పరిశ్రమల తర్ఫీదు సంస్థ ప్రిన్సిపల్ ఎస్.ఎం.పాషా, శిక్షకుడు వీరేశ్, ఐటీఐ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులకు వివరిస్తున్న అగ్నిమాపక అధికారులు

ఐసీసీ సమావేశం నిర్వహణకు డిమాండ్


మాట్లాడుతున్న రైతు సంఘం సభ్యులు

సిరివార (మాన్వి), న్యూస్‌టుడే: తాలూకాలో సాగు చేస్తున్న మెట్ట పంటలకు నీటి నిర్వహణ చేపట్టాలని కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం డిమాండ్ చేసింది. సంఘం తాలూకా సంచాలకుడు అమరేశ్ చాగబావి సోమవారం స్థానిక ఐబీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిరివార నీటిపారుదల శాఖ సబ్-డివిజన్ పరిధిలో కాలువపై తిరిగేందుకు సిబ్బంది, అధికారుల కొరత ఉందన్నారు. వీరిని భర్తీ చేయందే కాలువకు నీరు చేరడం కష్టమన్నారు. రాత్రింబవళ్లు ఒకరే పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సిరివార సబ్-డివిజన్‌కు మహిళా జేఈ ఉన్నారని, ఆమెని మార్చాలని కోరారు. తుంగభద్ర కాడా అధ్యక్షుడినీ మార్చాలని డిమాండ్ చేశారు. తుంగభద్ర కాలువ పరిధిలో సాగు చేసుకుంటున్న కర్షకులకు రెండో పంటకు నీటి విడుదలపై త్వరగా ఐసీసీ సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. నవంబర్ మొదటి వారంలో ప్రభుత్వం నిర్ణయాన్ని వెలువరించాలని లేకుంటే రైతుల్లో గందరగోళం నెలకొంటుందన్నారు. ఏప్రిల్ 10 వరకు నీరు విడుదల చేస్తేనే రెండో పంట అన్నదాతల చేతికి వస్తుందన్నారు. సంఘం ప్రతినిధులు వెంకటేశ్, శివకుమార్, అమరేశ్ మంత్రి, శరణప్పగుడదిన్ని, జగన్నాథ్, రాజశేఖరయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య రక్షణకే ప్రాధాన్యం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దినేశ్ గుండూరావు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై దృష్టి సారించి క్రమం తప్పకుండా వైద్య, ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని ఆరోగ్య శాఖ మంత్రి దినేశ్ గుండూరావు పిలుపునిచ్చారు. సరైన పరిమాణంలో నీరు తాగక పోవడం, వైద్య పరీక్షలు చేయించుకునేందుకు ముందుకు రాకపోవడంతోనే మూత్రపిండాల వ్యాధులు ఎక్కువవుతున్నాయని వివరించారు. మూత్రపిండాల వ్యాధులపై అవగాహన కల్పించేందుకు 'ది కిడ్నీ వారియర్స్ ఫౌండేషన్' సిద్ధం చేసిన పుస్తకాన్ని కేంద్ర ఆరోగ్య శాఖ ప్రధాన సంచాలకుడు డాక్టర్ అతుల్ గోయల్‌తో కలిసి సోమవారం ఇక్కడ విడుదల చేసి మాట్లాడారు. దేశంలో ఆరోగ్య బీమా తక్కువ మందికి మాత్రమే ఉందన్నారు. బీమాతోనే ఖరీదైన వైద్య చికిత్సలను పొందే పరిస్థితి ఉందని గుర్తు చేశారు. కిడ్నీ వారియర్స్ పుస్తకం ద్వారా ప్రతి ఒక్కరిలో అవగాహన కల్పించేందుకు ప్రయత్నిస్తున్నామని రచయిత్రి, ఫౌండేషన్ నిర్వాహకురాలు వసుంధర రాఘవన్ తెలిపారు.

రాహుల్ వ్యాఖ్యలపై వ్యాజ్యం తోసివేత


బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ 400 మహిళలపై అత్యాచారానికి పాల్పడ్డారంటూ వ్యాఖ్యలు చేసిన లోక్‌సభలో విపక్ష నాయకుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వచ్చిన వ్యాజ్యాన్ని ఉన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. దావా వేసిన ఆల్ ఇండియా దళిత్ యాక్షన్ కమిటీకి జస్టిస్ ఎస్‌వీ అంజారియా, జస్టిస్ కేవీ అరవింద్‌ల పీఠం రూ. 25 వేల జరిమానా విధించింది. ఇందులో ప్రజా హిత ఏమందని ప్రశ్నించింది. గత లోక్‌సభ ఎన్నికల సమయంలో శివమొగ్గలో నిర్వహించిన బహిరంగసభలో విపక్ష నేత రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. రాహుల్ వ్యాఖ్యలు భారతీయ మహిళలను కించపరిచేవిగా ఉన్నాయని అర్జీదారులు తమ వ్యాజ్యంలో పేర్కొన్నారు.

బెయిల్ నిరాకరణ..

ఒక మహిళపై అత్యాచారానికి పాల్పడిన ఆరోపణలతో అరెస్టయిన మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ బెయిలు కోసం వేసుకున్న అర్జీని ఉన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. హాసన జిల్లా ఠాణాలో నమోదైన కేసులో ప్రజ్వల్ ఇప్పటికే పరప్పన అగ్రహార కారాగారంలోనే ఉన్నారు. విచారణ పూర్తి చేసి- తీర్పును రిజర్వు చేసి ఉంచగా, జస్టిస్ ఎం నాగప్రసన్న బెయిలు అర్జీని తోసిపుచ్చుతున్నట్లు సోమవారం ప్రకటించారు.

సుప్రీంకోర్టు మెట్లెక్కిన సీబీఐ అధికారులు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : ఆదాయానికి మించి ఆస్తులను కలిగి ఉన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను విచారించేందుకు అనుమతించాలని కోరుతూ సర్వోన్నత న్యాయస్థానంలో సీబీఐ అర్జీ వేసుకుంది. శివకుమార్‌పై ఉన్న కేసు విచారణను సీబీఐ జరిపే విధంగా ప్రభుత్వం ఇచ్చిన అనుమతులను- సిద్ధరామయ్య, ఇతర మంత్రివర్గ సభ్యులు రద్దు చేసి, లోకాయుక్తకు బాధ్యతలు అప్పగించారు. దీన్ని ప్రశ్నిస్తూ, ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాల్ సర్వోన్నత న్యాయస్థానంలో ఒక వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దానికి అనుబంధంగా సీబీఐ అర్జీని దాఖలు చేయడం ప్రస్తావనార్హం.



నగరంలో పండ్లు కూరగాయల ధరలు (హాప్‌కామ్స్ కిలో. రూ.ల్లో)

బీన్స్- 125
క్యారెట్- 65
బీరకాయలు- 45
క్యాబేజీ- 18
కాలీఫ్లవర్(ఒక్కటి)- 15
సొరకాయ- 35
దొండకాయలు- 35
పొట్లకాయ- 35
టమాట(నాటు)- 60
టమాట(సాధారణ)- 45
గుమ్మడి- 35
ఆలుగడ్డ- 40
ఉల్లి (పెద్దవి)- 75
ఉల్లి (మామూలు)- 60
వెల్లుల్లి- 420
సాంబారు ఉల్లి- 120
బీట్‌రూట్- 25
వంకాయలు-35
బెండకాయలు- 28
ముల్లంగి- 35
నిమ్మకాయ- 270
వాషింగ్టన్ ఆపిల్- 345
సిమ్లా ఆపిల్- 135
గ్రీన్ ఆపిల్- 365
అరటి కాయలు- 55
సపోటా- 40
పైనాపిల్- 35
బొప్పాయి- 45
ఆరంజి- 65
బత్తాయి- 70

సురేశ్‌పై కుమార వ్యంగ్యాస్త్రాలు

మండ్య, న్యూస్‌టుడే: మాజీ ఎంపీ డీకే సురేశ్ చెన్నపట్టణ ఉప ఎన్నికల్లో పోటీ చేసినా.. గెలుపు గుర్రం ఎక్కలేరని కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి వ్యాఖ్యానించారు. చెన్నపట్టణ నుంచి పోటీ చేస్తాను.. గెలిచి మంత్రి అవుతానని ఆయన తన సన్నిహితుల వద్ద ప్రచారాన్ని చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఐదేళ్ల పాటు కాంగ్రెస్ ప్రభుత్వం ఉండదని జోస్యం చెప్పారు. కుమార వ్యాఖ్యలను డీకే సురేశ్ తీవ్రంగా ఖండించారు. ఇప్పటి వరకు 18 నెలల పాలనను కాంగ్రెస్ పూర్తి చేసిందని, ఐదేళ్ల వరకు ప్రభుత్వానికి ఎటువంటి ఢోకా లేదన్నారు. 'ఎవరో కొందరు వేసుకున్న ప్రభుత్వం పతనం అవుతుందని జోస్యం చెబుతారు. ప్రభుత్వాన్ని వారే కూల్చివేస్తారా?' అంటూ కుమారస్వామిని ఉద్దేశించి పరోక్ష వ్యాఖ్యలు చేస్తూ ప్రశ్నల్ని సంధించారు.



జేజేనగర : ఇంట్లోకి వచ్చిన నీటిని తోడేసే పనిలో నిమగ్నం



జేజేనగర : వి.ఎస్.గార్డన్‌లో వాననీరు తెచ్చిపెట్టిన ఇక్కట్లు



జయనగర : ప్రధాన రహదారిపై విరిగిపడిన చెట్టు

నడిసంద్రంలా రాజధాని

మరోసారి ముంచెత్తిన వాననీరు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: వాననీటి ఇక్కట్లు రాజధాని బెంగళూరు నగరాన్ని వీడనే లేదు. ఆదివారం అర్ధరాత్రి మొదలైన వాన.. తెల్లవారే వరకు వెన్నాడిన ఫలితంగా వీధులన్నీ నీటి మడుగుల్లా ప్రత్యక్షమయ్యాయి. అనేక ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ఇళ్లలోకి వాగులు పోటెత్తడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు జనజీవనం స్తంభించింది. రహదారుల్లోకి అడుగు పెట్టడం సాహసంతో కూడిన వ్యవహారంగా మారింది. వాహనాల రాకపోకలకు ఆటంకాలు ఎదురయ్యాయి. కెంగేరి, ఆర్.ఆర్.నగర, దాసరహళ్లి, కోరమంగల, శాంతినగర, అశోక్‌నగర, నాయండనహళ్లి, బ్యాటరాయనపుర, మడివాళ, విల్సన్‌గార్డన్, ఈజీపుర, వివేకానగర, సర్జాపుర, బెళ్లందూరు తదితర ప్రాంతాల్లో జనం పడుతూ లేస్తూ ముందుకు సాగారు. మైసూరు రోడ్డులోని అయ్యణ్ణప్ప లేఔట్‌లో 60 ఇళ్లలోకి వాననీరు చొరబడటంతో రాత్రింతా జనజాగారమే. ఇళ్లలో ఉండే



మడివాళ సమీపంలోని తావరకెరె వీధిలో నిలిచిన నీరు

వస్తువులతో పాటు విద్యార్థుల పుస్తకాలూ తడిచిపోయాయి. జేజేనగరలోని వి.ఎస్.గార్డన్‌లో ఉన్న 28 ఇళ్లదీ అదే సమస్య. కోరమంగల, మడివాళ, మైసూరు రోడ్డు, సర్జాపుర, బెళ్లందూరు రహదారుల్లో రెండు అడుగుల ఎత్తున నీరు ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. మైసూరు రోడ్డులోని గాలి ఆంజనేయ ఆలయంలోకి రాజకాలువ పొంగి ప్రవహించింది. మురుగునీటితో ఆ ప్రాంగణం మునిగిపోయి భక్తులను ముక్కులు మూసుకునేలా చేసింది. ఉదయం నుంచి ఆలయాన్ని శుభ్రం చేయడంతోనే సరిపోయింది. ఈ సమస్య అనేక సంవత్సరాలుగా కొనసాగుతున్నా నేటికీ పాలకులు పరిష్కరించలేదని పూజారులు ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు.

✦ సర్జాపుర ఆర్‌జేపీ టెక్‌పార్క్ ప్రదేశం జలమయమైంది. బెళ్లందూరు చెరువు పక్కన సక్రా ఆసుపత్రి రహదారిలోకి పడవలు వేసుకుని వెళ్లాలనేంతగా నీరు నిలిచాయి. విల్సన్‌గార్డన్ బీటీఎస్ ప్రధాన రహదారి వాగులా మారింది. ల్యావెలిరోడ్డు, హల్‌కుల్ రెసిడెన్స్ అపార్ట్‌మెంట్ కింద భాగాలు ముంపుపాలై జనం కకావికలమయ్యారు. జయనగర, జేపీనగర ప్రాంతాల్లో చెట్లు విరిగిపడ్డాయి. వాటిని పాలికె సిబ్బంది, పోలీసులు తొలగించేందుకు శ్రమించారు.

✦ నగరంలో కురిసిన వర్షానికి 97 రహదారులు మునిగి తేలినట్లు పాలికె చీఫ్ కమిషనర్ తుషార్‌గిరినాథ్ వెల్లడించారు. కొన్ని చోట్ల మడుగులు తరగక పోవడంతో ఇబ్బందులు ఎదురైనట్లు వివరించారు. నీరు సవ్యంగా ప్రవహించడానికి పాలికె సిబ్బంది శ్రమిస్తున్నారని, బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా నగరంలో వర్షం కొనసాగుతోందని వివరించారు. ఈనెల 22, 23 తేదీల్లో ఇదే స్థాయి వర్షపాతం నమోదయ్యే అవకాశాలుండటంతో యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు.



ఎంజీ రోడ్డు కూడలి : రహదారిపై నిలిచిపోతున్న నీటిని కాలువలోకి మళ్లించే ప్రయత్నం

ఇద్దరు బాలలు నీటిపాలు

మండ్య, న్యూస్‌టుడే : ఈత రాకపోయినా చెరువులో దిగి శంకరపురానికి చెందిన సోము (14), ముత్తురాజు (17) అనే బాలలు నీట మునిగి మరణించారు. మద్దూరు తాలూకా దేశహళ్లి గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఐదుగురు స్నేహితులు చెరువు వద్దకు వెళ్లగా వీరిద్దరూ నీట మునిగిపోయారు. ముత్తురాజు మృతదేహాన్ని అగ్నిమాపకదళ సిబ్బంది వెలికి తీశారు. సోము మృతదేహం కోసం గాలింపు చేపట్టారు. బెసగరహళ్లి ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



ఉత్తరహళ్లి : ప్రభుత్వ పాఠశాల గదుల్లో శుభ్రం చేస్తున్న ఆయాలు



సర్జాపుర : నీటిలో పడిపోతున్న వాహనదారుడికి పాదచారి రక్ష



కె.ఆర్.మార్కెట్ : నిత్యం కళకళలాడే ప్రాంతంలో జనసంచారం వెలవెల



కోరమంగల క్రీడామైదానాన్ని ముంచెత్తిన వానదేవుడు

పెళ్లి చేసుకోవాలని మేనమామ సతాయింపులు

కలబురగి, న్యూస్‌టుడే : వివాహం చేసుకోవాలంటూ మేనమామ సునీల్ వేధిస్తున్నాడని ఒక ఉద్యోగిని కలబురగి విశ్వవిద్యాలయం ఠాణాలో ఫిర్యాదు చేశారు. బాధితురాలు జలవనరుల శాఖలో జూనియర్ ఇంజినీరుగా పని చేస్తున్నారు. ఆమె మేనమామ కలబురగి వర్సిటీ ఎన్విరాన్‌మెంట్ సైన్సు విభాగంలో పరిశోధక విద్య అభ్యసిస్తున్నారు. మేనమామను చేసుకోవడం ఇష్టం లేదని చెబుతున్నా.. అతను వినకుండా వేధిస్తున్నాడని, మాట వినకపోతే తన చిత్రాలను మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో ఉంచుతానని బెదిరిస్తున్నాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

పారిశ్రామికవాడ విస్తరణకు చర్చలు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: నెలమంగల పారిశ్రామికవాడకు అనుబంధంగా ఉన్న 11.8 ఎకరాల పోరంబోకు భూమిని తమకు కేటాయించాలని చిన్న పరిశ్రమల సమాఖ్య కాసియా కోరింది. రెవెన్యూ శాఖ మంత్రి కృష్ణ భైరేగౌడను కాసియా ప్రతినిధులు సోమవారం కలిసి చర్చించారు. నెలమంగల పరిధి నరసింహన పాళ్య, నారాయణరావు పాళ్యలో 143.35 ఎకరాల్లో 2010 నుంచి పారిశ్రామికవాడ విస్తరించింది. అందులో ఇప్పటికే 555 పరిశ్రమలు ఉన్నాయి. దానికి అనుబంధంగా ఉన్న భూమిని తమకు అప్పగిస్తే అక్కడ మరికొన్ని పరిశ్రమలను ఏర్పాటు చేసుకుంటామని మంత్రిని కోరారు. తమ వినతికి కృష్ణ భైరేగౌడ సానుకూలంగా స్పందించారని కాసియా అధ్యక్షుడు ఎంజీ రాజగోపాల్ తెలిపారు.



కృష్ణ భైరేగౌడతో చర్చల్లో కాసియా ప్రతినిధులు

మూత్రపిండం నుంచి అసహజ రాళ్ల తొలగింపు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: రాయచూరుకు చెందిన చాంద్‌పాషా (29) అనే యువకుడి మూత్రపిండంలో అసహజ రూపంలో ఏర్పడిన రాళ్లను బెంగళూరులోని సప్తగిరి వైద్యవిద్య కళాశాల, ఆసుపత్రిలోని వైద్యుల బృందం విజయవంతంగా తొలగించింది. సాధారణంగా రాళ్లు గుండ్రంగా ఏర్పడతాయి. చాంద్‌పాషా మూత్రపిండాల్లో అసాధారణంగా నాలుగు పలకలుగా అవి ఏర్పడ్డాయి. పుట్టుక నుంచే ఈ రాళ్లు ఉన్నాయని ఆలస్యంగా గుర్తించారు. కళాశాల ఆధ్వర్యుడు డాక్టర్ ఎం.శివలింగయ్య నేతృత్వంలో వైద్యులు అర్జున్, ధనశేఖర్, పృథ్వీరాజ్ శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. వీటిని తొలగించిన అనంతరం మూత్రకోశ సమస్యలు పూర్తిగా తొలిగాయని చాంద్‌పాషా తెలిపారు.



రాళ్లు కనిపిస్తున్న ఎక్సరే

పేలిన నాటుబాంబు

ఛిద్రమైన వృద్ధుడి చెయ్యి

రామనగర, న్యూస్‌టుడే: సాతనూరు పరిధి ఉప్పరకెరెదొడ్డి గ్రామంలో నాటు బాంబు పేలి దొడ్డమనె శివనేగౌడర (75) అనే వృద్ధుడి కుడి చెయ్యి ఛిద్రమైంది. కొబ్బరి తోటలో కిందపడిన కాయల పీచు వలిచే సమయంలో పక్కనే ఉన్న నాటు బాంబును కొబ్బరికాయ అనుకుని కొడవలితో కొట్టడంతో ఒక్కసారిగా అది పేలిపోయింది. గతంలోనూ ఇదే తోటలో ఒక ఆవు బాంబును కొరకడంతో మరణించింది. బాధితుడికి కనకపుర ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించి, మెరుగైన చికిత్స కోసం బెంగళూరులోని సంజయనగర ఆసుపత్రిలో చేర్పించారు. పొలంలోకి నాటుబాంబులు ఎలా వచ్చాయో గుర్తించేందుకు కనకపుర గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మాదవారకు నెలాఖరులో మెట్రో

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: నమ్మ మెట్రో తూర్పు- పడమటి నడవా పరిధిలో నాగసంద్ర- మాదావర మధ్య 3.4 కిలోమీటర్ల పొడిగింపు మార్గంలో మెట్రో రైలు సంచారం ఈనెలాఖరులో ప్రారంభిస్తారు. ఇప్పటికే రైలు సంచారానికి కేంద్ర మెట్రో రైలు సురక్షిత ప్రాధికార అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు ప్రారంభోత్సవానికి తేదీలు నిర్ణయించలేదని, ఆ వివరాలు నిర్ణయించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బీఎంఆర్‌సీఎల్ అధికారులు లేఖలు రాశారు. నెలాఖరులో ప్రారంభించేందుకు అనుమతించినట్లు అధికారులు తెలిపారు. పొడిగింపు మార్గంలో మూడు ప్రయాణ ప్రాంగణాలు నిర్మించారు. రైలు సంచారం ప్రారంభిస్తే తుమకూరు, నెలమంగల, బెంగళూరు అంతర్జాతీయ వస్తు ప్రదర్శన కేంద్రం తదితర ప్రాంతాలకు తక్కువ సమయంలో ప్రయాణికులు చేరుకోవచ్చు. నిత్యం సంచార రద్దీగా ఉండే తుమకూరు రహదారిలో పరిస్థితి అదుపులోకి వచ్చేందుకు కొత్త వ్యవస్థ ఉపకరిస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రారంభం కోసం ఆ ప్రాంతాల ప్రజలు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్నారు.



నాగసంద్ర- మాదావర మధ్య సంచరిస్తున్న మెట్రో రైలు

మూడింటా కాంగ్రెస్‌దే విజయం

సీఎం సిద్ధరామయ్య జోస్యం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య

చెళ్లకెర, చిత్రదుర్గం, న్యూస్‌టుడే: విధానసభకు జరుగనున్న మూడు శాసనసభ నియోజకవర్గాల ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు తథ్యమని ముఖ్యమంత్రి ఎస్. సిద్ధరామయ్య జోస్యం చెప్పారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే రఘుమూర్తి కుమార్తె సుచిత్ర, వరుడు వరుణ్ వివాహానికి విచ్చేసిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజల మద్దతు ఉందన్నారు. చెన్నపట్టణ ఉప ఎన్నికల్లో జేడీఎస్, భాజపాలు అభ్యర్థిని ప్రకటించనీయండని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఒకటి, రెండు రోజుల్లో అభ్యర్థిని ఖరారు చేస్తుందన్నారు. సీపీ యోగీశ్వర్‌ను కాంగ్రెస్ పార్టీ తమ వైపు లాక్కోవడానికి ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదని, జేడీఎస్ పార్టీ నేతలు చేస్తున్న ఆరోపణలు సత్యదూరమన్నారు. తమ ప్రభుత్వాన్ని కూల్చడానికి రూ. వెయ్యి కోట్లు ఖర్చుపెడుతున్నారని భాజపా ఎమ్మెల్యే బసవరాజ్ యత్నాల్ చెబుతున్నారని, ఈ డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. ఇది అవినీతి డబ్బుకాక మరేమిటని సిద్ధు ప్రశ్నించారు. నల్లధనం కూడా అయిండవచ్చన్నారు. రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తుండటంతో సమస్యల పరిష్కారానికి ముందు జాగ్రత్తలు తీసుకొంటున్నట్లు సీఎం పేర్కొన్నారు. ఈ వర్షాలకు పెద్దగా పంట నష్టం వాటిల్లలేదన్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో బెంగళూరుతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయన్నారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, జిల్లా బాధ్య మంత్రి డి. సుధాకర్, మంత్రి హెచ్.కె.పాటిల్, మాజీ మంత్రి ఆంజనేయలు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

ముగ్గురు బిడ్డలతో తల్లి ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతూ ఆమె మృతి

కలబురగి, న్యూస్‌టుడే: భర్తతో జరిగిన గొడవతో ఆవేదనకు గురైన గీతాబాయి సంతోష్ రాథోడ్ (30) అనే యువతి తన ముగ్గురు పిల్లలకు విషాహారాన్ని పెట్టి, అనంతరం తానూ అదే ఆహారాన్ని తిని ఆత్మహత్యకు ప్రయత్నించింది. ఆకలిగా ఉండడంతో తల్లి తినిపిస్తున్న గోరుముద్దల్ని తిని చైతన్య (4), ధనుష్ (3) నెలన్నర వయసు ఉన్న లక్ష్మి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. నలుగురినీ చికిత్స కోసం బీదర్ ప్రభుత్వ ఆసపత్రిలో చేర్పించగా.. లక్ష్మి మినహా మిగిలిన ముగ్గురూ ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. చించోళి తాలూకా జంగ్లిపీర్ తాండాలో ఈ ఘటన చోటు చేసుకుంది. చించోళి ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మంత్రి జమీర్‌పై గవర్నర్‌కు ఫిర్యాదు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : ముడా అక్రమాలకు సంబంధించి హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను 'రాజకీయ ప్రేరిత తీర్పు' అని వ్యాఖ్యలు చేసిన మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్‌పై చర్యలు తీసుకోవాలని సామాజిక సేవా కార్యకర్త టీజే అబ్రహం డిమాండ్ చేశారు. జమీర్‌పై కేసు నమోదుకు అనుమతి ఇవ్వాలని రాజ్‌భవన్‌లో గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్‌ను సోమవారం కలిసి విన్నవించారు. కేసు నమోదుకు అవకాశం ఇవ్వాలని అడ్వకేట్ జనరల్‌ను కోరినా స్పందన రాకపోవడంతో గవర్నర్ గహ్లోత్‌కు వినతి పత్రాన్ని ఇచ్చానని తెలిపారు.

నగదు బదులుగా నిత్యావసరాల కిట్

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : అన్నభాగ్య పథకంలో ఒక వ్యక్తికి పది కిలోల బియ్యం ఇవ్వవలసి ఉండగా.. ప్రస్తుతం 5 కిలోలు మాత్రమే ఇస్తున్నారు. మిగిలిన మొత్తానికి కిలో రూ.34 చొప్పున 5 కిలోలకు లెక్కించి నగదు ఇస్తున్నారు. నగదు సకాలంలో తమ ఖాతాలలో జమ కావడం లేదని ఫిర్యాదులు ఎక్కువయ్యాయి. ఇకపై ఆ నగదు బదులుగా పప్పు ధాన్యాలు, ఇతర నిత్యావసరాలను వినియోగదారులకు అందించాలని యోచిస్తున్నామని ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి కేహెచ్ మునియప్ప తెలిపారు.

సురేశ్‌పై శోభా నిప్పులు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పెద్ద కుమారుడు రాకేశ్ మరణానికి రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి భైరతి సురేశ్ కారణమని కేంద్ర మంత్రి శోభా కరంద్లాజె ఆరోపించారు. ఇప్పుడు సిద్ధరామయ్య వెంటే తిరుగుతూ తన తప్పునకు ప్రాయశ్చిత్తం చేసుకునేందుకు భైరతి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఆమె దిల్లీలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ముడా కార్యాలయం నుంచి సిద్ధరామయ్య, ఆయన భార్య పార్వతికి సంబంధించిన దస్త్రాలను సురేశ్ తీసుకువచ్చి కాల్చివేశారని మరోసారి ఆరోపించారు. యడియూరప్ప భార్య మైత్రేయి దేవి అనుమానస్పద మరణానికి శోభా కరంద్లాజె వాస్తవాలు వెల్లడించాలంటూ సురేశ్ చేసిన వ్యాఖ్యలను ఆమె ఖండించారు. నాలుకపై అదుపుతప్పితే పరువు నష్టం కేసును ఎదుర్కొనవలసి ఉంటుందని తీవ్రంగా హెచ్చరించారు. రాజకీయ విమర్శలను ఎదుర్కోలేక వ్యక్తిగత దూషణలకు దిగడాన్ని తప్పుబట్టారు.

వంటింట్లో పేలిన గ్యాస్‌సిలిండర్

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: వంటగ్యాస్ సిలిండర్ పేలి వంటమనిషి గాయపడిన సంఘటన సోమవారం ఉదయం బెంగళూరు సుద్దగుంటెపాళ్య పోలీసుఠాణా పరిధిలో భయాందోళనలు సృష్టించింది. బీటీఎం లేఔట్ మొదటి స్టేజి మంజునాథ్ లేఔట్‌లో ఉత్తరప్రదేశ్ నివాసి పవన్ అద్దెకు ఉంటున్నాడు. సిలిండర్ ఖాళీ అవడంతో కొత్తది బిగించాడు. అది లీక్ కావడాన్ని గుర్తించలేకపోయారు. ఉదయం 8.30 గంటలకు పాలు కాసేందుకు స్టవ్ అంటించే సమయంలో సిలిండర్ పేలినట్లు పోలీసులు తెలిపారు. గోడ కూలిపోవడంతో పాటు ఇంట్లో ఉండే వస్తువులు చెల్లాచెదురైనట్లు వివరించారు. విషయం తెలిసిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు అక్కడికి వచ్చి పరిశీలించారు. ప్రమాదంలో వంట మనిషి తీవ్రంగా గాయపడ్డాడు.

ఘరానా దొంగ అరెస్టు

భారీగా బంగారం పట్టుకున్న సింధనూరు పోలీసులు



దొంగ నుంచి స్వాధీనం చేసుకున్న సొత్తును చూపిస్తున్న జిల్లా ఎస్పీ, ఇతర అధికారులు

సింధనూరు, న్యూస్‌టుడే: సింధనూరు పోలీసులు సోమవారం ఓ దొంగ నుంచి భారీ మొత్తంలో బంగారం ఆభరణాలు, నగదు స్వాధీనం చేసుకుని ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకున్నారు. రాయచూరు జిల్లా ఎస్పీ పుట్టమాదయ్య సోమవారం సాయంత్రం స్థానిక టౌన్ పోలీసు స్టేషన్‌లో విలేకరులకు వివరించిన ప్రకారం.. సికింద్రాబాదు టోకు బంగారం వ్యాపారి భరత్‌కుమార్ కమీషన్‌పై నగలు అమ్ముకొని రావాలని తన ఇద్దరు నమ్మకస్తులను 2 కిలోల అయిదు తులాల బంగారు ఆభరణాలను (విలువ రూ.1.44 కోట్లు) ఇచ్చి పంపారు. జతగా రూ.40,150 నగదును ఇచ్చారు. ఇద్దరు నమ్మకస్తులు సర్వేశ్‌కుమార్ జైన్, నిర్మల్ కుమార్ జైన్ మూడు రోజుల కిందట సింధనూరు చేరుకుని స్థానిక జైన్‌మందిర్ సమీపంలోని ఓ అద్దె గది తీసుకుని విశ్రాంతి తీసుకున్నారు. ఇందులో సర్వేశ్‌కుమార్ జైన్ గుడికి వెళ్లొస్తానని ఉదయాన్నే బయటకు వెళ్లాడు. ఇదే అదనుగా చూసుకున్న రెండోవాడు నిర్మల్‌కుమార్ జైన్ మొత్తం నగలు, నగదు పట్టుకుని ఉడాయించాడు. రోజంతా వెతికి చివరికి విషయాన్ని సికింద్రాబాద్‌లోని తమ యజమాని భరత్‌కుమార్‌కు వివరించాడు.. దీంతో లబోదిబోమంటూ సింధనూరు పోలీసులను ఆశ్రయించాడు. రంగంలోకి దిగిన పోలీసులు రెండు రోజులు గాలించి చివరికి దొంగ ఆచూకీ కనుగొన్నారు. మాన్విలోని ఓ లాడ్జిలో ఉన్నట్లు తెలుసుకుని కాపుగాచి సోమవారం పట్టుకున్నారు. మొత్తం సొత్తు స్వాధీనం చేసుకున్నారు. పెద్దమొత్తంలో దొంగిలించబడిన సొత్తును చాకచక్యంతో పట్టుకున్న సింధనూరు పోలీసులను జిల్లా ఎస్పీ పుట్టమాదయ్య అభినందించారు.

బెంగళూరు

•బెంగళూరు •హోసూరు



ముగిసిన హ్యాకథాన్ పోటీలు

కేంద్ర ప్రభుత్వం, టెలికాం శాఖ, ఐఐఐటీ-బెంగళూరు సంయుక్తంగా నిర్వహించిన 30 గంటల 5జీ, 6జీ హ్యాకథాన్ పోటీలకు తెరపడింది. ప్రోయవ ఇన్నోవేషన్స్ రూ.2 లక్షలతో మొదటి, రూ.1.5 లక్షలతో కేబుల్ స్మిత్ ద్వితీయ బహుమతులు దక్కించుకున్నాయి. ఐఐఐటీ-బి డైరెక్టర్ ఆచార్య దేవవ్రతదాస్, సీఈఓ పి.శ్రీధర్ విజేతలకు ప్రమాణపత్రాలు, చెక్కులు అందజేశారు. -న్యూస్‌టుడే, బెంగళూరు (శివాజీనగర)



ఆర్ఎస్ఎస్ సేవాభారతి కార్యకర్తల కవాతు

దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఆర్ఎస్ఎస్ సేవాభారతి మహిళా కార్యకర్తలు శ్రీరామపురంలో చేసిన కవాతు ఆకట్టుకుంది. ఎర్రంచు తెల్ల చీరలతో భుజాలపై లాఠీలు పెట్టుకొని శ్రీరామపురం, లక్ష్మణపుర, దేవయ్య పార్కు మార్గాల మీదుగా సాగారు. ఆదివారం సాయంత్రం జరిగిన ఈ కవాతుకు ముందుజాగ్రత్తగా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. -న్యూస్‌టుడే, బెంగళూరు (శివాజీనగర)

హోసూరు కబుర్లు

రైతుల సమస్యలు తీర్చకపోతే ఉద్యమమే

✦ భారత్‌మాల పథకంపై ఎంపీ హెచ్చరిక



సమావేశంలో వివరాలు తెలుపుతున్న ఎంపీ గోపినాథ్

హోసూరు, న్యూస్‌టుడే: 'డెంకణీకోట తాలూకా ఉప్పారపల్లి నుంచి హోసూరు తాలూకా దేవీరపల్లి వరకు 44 కి.మీ. దూరానికి భారత్‌మాల రోడ్డు నిర్మాణ పనుల కోసం జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏ) రైతుల నుంచి భూ సేకరణ చేసింది. ఇందులో భాగంగా ఆ సంస్థ అధికారులు అన్నదాతలకు వివిధ హామీలు ఇచ్చారు. వాటిని నెరవేర్చకుండా అధికారులు నిర్లక్ష్యం చేసి రోడ్డు నిర్మాణ పనులు కొనసాగించడం తగదు. బాధిత కర్షకులను ఆదుకోవడానికి హోసూరులో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని' కృష్ణగిరి ఎంపీ కె.గోపినాథ్ హెచ్చరించారు. ఆయన సోమవారం హోసూరులోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. బెంగళూరు నైసు రోడ్డు మాదిరిగా నిర్మాణం జరుగుతున్నందున రైతులు తమ పంటపొలాలకు ఒకవైపు నుంచి మరోవైపు వెళ్లడానికి వీల్లేకుండా భద్రత గోడలను ఏర్పాటు చేయడం దారుణమన్నారు. అన్నదాతలు తమ వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు ఇరువైపులా సర్వీసు రోడ్డు నిర్మించకపోవడంతో అవస్థలు పడుతున్నారన్నారు. దీనిపై తనకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి లేఖ వచ్చిందన్నారు. దాని ప్రకారం మల్లసంద్రం, ఆలూరు, అట్టూరు, తొరపల్లి, అలసపల్లి, బడదేపల్లి, నందిమంగలం తదితర గ్రామాల వద్ద సర్వీసు రోడ్లు నిర్మించడానికి ఎన్‌హెచ్‌ఏ పేర్కొన్నట్లు ఉందన్నారు. 10,815 మీటర్ల దూరం వరకు సర్వీసు రోడ్డు నిర్మిస్తారని తెలిసి బాధిత రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ రెండు తాలూకాల్లో 44 కి.మీ. దూరం వరకు రహదారికి ఇరువైపులా సర్వీసు రోడ్డు నిర్మాణం చేయాలని ఎంపీ కోరారు. కర్షకులకు వసతిగా అండర్‌పాస్ వంతెనలను నిర్మించాలని స్పష్టం చేశారు. అన్నదాతల సమస్యల పరిష్కారానికి జాతీయ రహదారుల కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలవనున్నట్లు చెప్పారు. తాను ఆర్థిక సంఘం సభ్యుడిగా ఉన్నందున 28న దిల్లీలో జరిగే సమావేశంలో దీనిపై మాట్లాడతానన్నారు. తాను ఎంపీగా బాధ్యతలు స్వీకరించిన నాలుగు నెలల్లోనే అనేక అభివృద్ధి పనులు చేపట్టానన్నారు. హోసూరు-కృష్ణగిరి జాతీయ రహదారిలో ప్రమాదాల నివారణకు ఐదు స్థలాల్లో పైవంతెనలు, ఆరు ప్రాంతాల్లో కింది వంతెనల నిర్మాణం జరగనుందన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు మైజా అక్బర్, చిన్నగుట్టప్ప, నీలకంఠన్, సాదిక్, రైతులు పరంగ మల్లసందరం మురళీ, హరీష్ తదితరులున్నారు.

ముంపు ప్రాంతాల సందర్శన



సిల్క్‌బోర్డు కూడలిలోని రాజ కాలువను పరిశీలిస్తున్న ప్రతిపక్ష నేతలు అశోక్, నారాయణస్వామి, ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి తదితరులు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: నగరంలో కురిసిన వర్షాలకు ముంపునకు గురైన ప్రాంతాల్లో సోమవారం ప్రతిపక్ష నేతలు ఆర్.అశోక్, చలవాది నారాయణస్వామి పర్యటించారు. కోరమంగల, మడివాళ, సిల్క్ బోర్డు, హెచ్ఎస్ఆర్ లేఅవుట్‌లో తిరిగారు. సిల్క్ బోర్డు కూడలి మునిగిపోవడానికి కారణమైన రాజ కాలువను పరిశీలించారు. రాజధాని నగరం వాననీటితో మునిగిపోతుంటే కాంగ్రెస్ పాలకులు స్వార్థ రాజకీయాల్లో మునిగి తేలుతున్నారని ప్రతిపక్ష నేత ఆర్.అశోక్ మండిపడ్డారు. ముంపు నుంచి ప్రజలను రక్షించాల్సిన బాధ్యత నుంచి కాంగ్రెస్ పాలకులు తప్పుకొన్నారని ఆరోపించారు. తక్షణం ముంపు ప్రాంతాల్లో పరిస్థితిని సమీక్షించి చర్యలు తీసుకోవాలని, నష్టపోయిన ప్రజలకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట స్థానిక శాసనసభ్యుడు సతీశ్‌రెడ్డి తదితరులున్నారు.


చిత్రదుర్గంలో కుండపోత

చిత్రదుర్గం: పట్టణంలో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నాలుగు దఫాలుగా వర్షం కురవడంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. మురుగునీటి కాలువలు పొంగడంతో రహదారులన్నీ నీటి మడుగుల్ని తలపించాయి. ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో సుమారు గంటపాటు కుండపోతను తలపించేలా వాన పడటంతో లోతట్టు ప్రాంతాలు కెళగోటె, మండక్కి బట్టీ, ప్రశాంతనగర్, మారుతీనగర్ ముంపునకు గురయ్యాయి. ఈ ప్రాంతాల్లోని పలు ఇళ్లలోకి వరద నీరు చేరడంతో స్థానికులు రాత్రంతా మేల్కొని నీటిని బయటకు పంపడానికి నానా అవస్థలు పడ్డారు. మరోవైపు పాతూరు నుంచి వరద నీరు ఒక్కమారుగా ప్రధాన రహదారి పైకి చేరడంతో దాదాపు రెండు గంటలపాటు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రధాన మార్గంలో మోకాలు లోతు వరకు నీరు నిల్వ ఉండటంతో ద్విచక్ర వాహన, ఆటో చోదకులు ఇబ్బందులు పడ్డారు. పలు వాణిజ్య దుకాణాల్లోకి వరద నీరు చేరడంతో వేలాది రూపాయల సామగ్రికి నష్టం వాటిల్లింది.



ప్రధాన రహదారిపై మోకాలు లోతున చేరిన నీరు

కర్ణాటక వసతి మండలి అధ్యక్షుడిగా సోమశేఖర్



సహకార క్షేత్రంలో దాదాపు 30 ఏళ్ల అనుభవం కలిగిన మాజీ మంత్రి, యశ్వంతపుర విధానసభ క్షేత్రం ఎమ్మెల్యే ఎస్‌టీ సోమశేఖర్ నాలుగోసారి కర్ణాటక రాష్ట్ర వసతి మండలి అధ్యక్షుడిగా తిరిగి ఎన్నికయ్యారు. సోమవారం బసవనగుడి క్షేత్రంలో జరిగిన మండలి సభ్యుల సమావేశంలో ఆయనను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సభ్యులు ఆయనను అభినందించారు. -న్యూస్‌టుడే, బెంగళూరు (కెంగేరి)

పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

పావగడ, న్యూస్‌టుడే: నవంబరు 1న జరిగే కన్నడ రాజ్యోత్సవంలో ప్రశస్తుల స్వీకరణకు వివిధ రంగాల్లో అత్యుత్తమ సేవలు అందించిన వారి నుంచి తాలూకా పాలనా యంత్రాంగం 2024-25 ఏడాదికి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. సాహిత్య, జానపద కళలు, క్రీడలు, రంగభూమి కళాకారులు, సామాజిక సేవకులు, పౌర కార్మికులు, పత్రికా మాధ్యమం, గడినాడు కన్నడ సేవ, ఆరోగ్య, గ్రామీణ కళాక్షేత్రం తదితర రంగాల్లో నాణ్యమైన సేవలందించిన వారిని ప్రోత్సహించి సత్కరించడానికి నిర్ణయించడం జరిగింది. ఆసక్తి కలిగిన వారు 25లోపు తహసీల్దారు కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని తాలూకా పాలనాధికారులు ఒక ప్రకటనలో తెలియజేశారు.

వీఎస్ఎస్ఎన్ భవనాల ప్రారంభోత్సవం



రిబ్బన్ కత్తిరిస్తున్న స్వామి, రాజేంద్ర, వెంకటేశ్

పావగడ, న్యూస్‌టుడే: పావగడ తాలూకాలోని వివిధ వీఎస్ఎస్ఎన్ నూతన భవనాల ప్రారంభోత్సవం సోమవారం జరిగింది. విధాన పరిషత్ సభ్యుడు రాజేంద్ర రాజణ్ణ, స్థానిక ఎమ్మెల్యే హెచ్.వి.వెంకటేశ్ తాలూకాలోని గుమ్మఘట్ట, సి.కె.పుర, లింగదహళ్లి, కోటగుడ్డ, పొన్నసముద్ర, నాగలమడక గ్రామాల్లో పర్యటించి అక్కడ నిర్మించిన వ్యవసాయ సేవా సహకార సంఘం నూతన కార్యాలయాలు, గోదాములు, కంప్యూటర్ గదులు, సమావేశ భవనాలకు ప్రారంభోత్సవం చేశారు. వెంకటాపురలోని వ్యవసాయ సేవా సహకార కార్యాలయాన్ని పరిశీలించి సభ్యులతో మాట్లాడారు. రంగసముద్రలోని మహర్షి వాల్మీకి విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. అనంతరం నిడిగల్లు వాల్మీకి ఆశ్రమ అధ్యక్షుడు సంజయ్‌కుమార్ స్వామి, మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్పతో కలిసి కోటగుడ్డ వీఎస్ఎస్ఎన్ కొత్త భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమాల్లో డీసీసీ బ్యాంకు డైరెక్టర్లు తాళేమరదహళ్లి నరసింహయ్య, ఎన్.మూర్తి, పురసభ అధ్యక్షుడు రాజేష్, మాజీ అధ్యక్షుడు శంకరరెడ్డి, డీసీసీ బ్యాంకు వ్యవస్థాపకుడు జంగమప్ప, సీఈవో నారాయణమూర్తి, నాయకులు బత్తినేని నాని, రామాంజినప్ప, రవి, కోటగుడ్డ అంజినప్ప తదితరులు పాల్గొన్నారు.

సాధకోత్తములకు మధ్వ విజయ ప్రశస్తి



ముళబాగిలు స్వామితో రవిసుబ్రహ్మణ్య, వెంకోబరావు తదితరులు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: శ్రీమద్వాచార్యుల జయంతి నేపథ్యంలో వ్యాస-దాస సాహిత్యరంగంలో సేవలందించిన వారికి చామరాజపేటలోని శ్రీమన్మధ్వ సంఘంలో మధ్వ విజయ ప్రశస్తి ప్రదానోత్సవం జరిగింది. విశ్వమత సంక్షేమ సంఘం ఆధ్వర్యం వహించింది. తొలుత బసవనగుడి గాంధీబజార్ సోసలే వ్యాసరాజ మఠం నుంచి మన్మధ్వ సంఘం వరకు శోభాయాత్రను శాసనసభ్యుడు రవిసుబ్రహ్మణ్య ప్రారంభించారు. ముళబాగిలు పాదరాజ మఠాధిపతి సుజయనిధితీర్థ సాన్నిధ్యంలో హరిదాస సాహిత్య విద్వాంసులు డా.అరళమల్లిగె పార్థసారథి, తితిదే మాజీ సభ్యుడు డాక్టర్ డి.పి.అనంత, సమాజ సేవకుడు విద్వాన్ ప్రసన్నహబ్బుణి, విజయమాల ట్రస్ట్ సంస్థాపకురాలు హరిణిపగడాలతో పాటు చామరాజపేట మన్మధ్వ సంఘానికి ప్రశస్తులను ప్రదానం చేసి సత్కరించారు. విద్యాపీఠలో శాస్త్ర అధ్యయనం చేస్తున్న విద్యార్థులు ఎస్.బి.సాగర్, ప్రణవాచార్య, శ్రీనిధి ఆచార్య, చరణ్ వశిష్టలకు వేదవ్యాస పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంఘం సంస్థాపక అధ్యక్షుడు బి.కె.వెంకోబరావు, మాజీ ఉపాధ్యక్షుడు ఆర్.లక్ష్మీకాంత్, అధ్యక్షుడు నాగేష్, విమర్శకుడు గురురాజపోశెట్టిహళ్లి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి బోసురాజుపై ఫిర్యాదు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: మంత్రి ఎన్ఎస్ బోసురాజు తన భార్య పేరిట అటవీ భూమిని ఆక్రమించుకున్నారని సామాజిక కార్యకర్త దినేశ్ కల్లహళ్లి ఆరోపించారు. రాయచూరు సమీపంలోని రక్షిత అటవీ భూమిలో 5 ఎకరాల 27 గుంటల భూమిని కబ్జా చేసుకున్నారని పేర్కొన్నారు. మంత్రిపై చర్యలు తీసుకోవాలంటూ గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు.

వైభవంగా వీరాంజనేయ మండల పూజ



హోమం చేస్తున్న మునియప్ప, యశోదమ్మ, భక్తులు

చూడాపురం (బేలికె), న్యూస్‌టుడే: బాగలూరు పంచాయతీ చూడాపురం పరిధి జ్యూస్ పరిశ్రమ సమీపంలోని జీవానగర్‌లోని వీరాంజనేయ దేవాలయాన్ని ఆలయ ధర్మకర్త ఆర్.మునియప్ప యశోదమ్మ ఆధ్వర్యంలో దాతల సాయంతో నిర్మించారు. ఆది, సోమవారాల్లో వైభవంగా ఆలయ ప్రతిష్ఠాపన, కుంభాభిషేకం నిర్వహించారు. ఇందులో భాగంగా 48వ రోజు మండల పూజను పురస్కరించుకుని గణపతి పూజ, వాసుదేవ పుణ్యారాధన, శాంతి, ప్రాయశ్చిత్త హోమాలు చేశారు. స్వామివారికి వివిధరకాల అభిషేకాలు చేసి సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం అన్నదానం జరిపారు. ఈ సందర్భంగా కళాకారులు ప్రదర్శించిన భరత నాట్యంతో పాటు గానాలాపన అలరించాయి. కార్యక్రమంలో మాజీ మంత్రి పి.బాలకృష్ణ రెడ్డి, ఆలయ కార్యనిర్వాహకులు యశోదమ్మ, జిల్లా కౌన్సిలర్ రవికుమార్, ఆర్.జగదీష్, వెంకటేశరెడ్డి, గుణశేఖర్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పంటపొలాలు కామధేనువుతో సమానం



ఎమ్మెల్యే హరీష్‌పుంజాకు వరి నారు అందజేస్తున్న సోనియా యశోవర్మ

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: ధర్మస్థల ఉజిరేలో కళాశాల విద్యార్థులతో వరి నారు నాటించే కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. బేళాలు గ్రామం అనంతోడియలోని అనంత పద్మనాభ ఆలయ ఆవరణలో బదుకు కట్టోణ బృందం, బెళ్తంగడి రోటరీ క్లబ్, ఎస్‌డీఎం కళాశాల, ఎన్ఎస్ఎస్, ఎస్‌డీఎంఏ క్రీడా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన నాజినేటి (వరి నారు నాటే) కార్యక్రమాన్ని ఉజిరేకు చెందిన సోనియా యశోవర్మ ఎమ్మెల్యే హరీష్‌పుంజాకు వరి నారు ఇచ్చి ప్రారంభించారు. తొలుత వరి నారును అనంత పద్మనాభ ఆలయానికి తీసుకెళ్లి స్వామికి సమర్పించి పూజలు చేశారు. ఈ సందర్భంగా సోనియా యశోవర్మ మాట్లాడుతూ ప్రకృతికి సేద్యానికి విడదీయలేని సంబంధం ఉందన్నారు. పంటపొలాలు కామధేనువు, కల్పవృక్షం వంటివన్నారు. వ్యవసాయం భారతీయ సంస్కృతికి ప్రతీక అన్నారు. ఎమ్మెల్యే హరీష్ పుంజా, ఎమ్మెల్సీ కె.ప్రతాపసింహనాయక్, వందలాది మంది విద్యార్థులు పొలంలో వరి నారు నాటారు. రాష్ట్ర ప్రశస్తి గ్రహీత, కృషి రుషి బి.కె.దేవరావ్‌ను సత్కరించారు. ఎస్‌డీఎం కళాశాల ఎన్ఎస్ఎస్ సంచాలకుడు ఆచార్య మహేష్ కుమార్‌శెట్టి, ఇంజినీరింగ్ కళాశాల ఉపన్యాసకుడు రవీస్‌పడుమలే, బెళ్తంగడి రోటరీక్లబ్ అధ్యక్షుడు పూరణ్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంహిత అరంగ్రేటం



సంహితకు ప్రశంసాపత్రం అందజేస్తున్న శుభాధనంజయ తదితరులు

బెంగళూరు (యశ్వంతపుర) : నగరంలోని జయనగర ఎనిమిదో బ్లాక్ జేఎస్ఎస్ ఆడిటోరియంలో నాదనర్తన సంగీత నాట్య పాఠశాల అధ్వర్యంలో నాట్య సించన పేరుతో కళాకారిణి సంహిత అరంగ్రేటం ఘనంగా జరిగింది. కర్ణాటక రాష్ట్ర సంగీత నృత్య అకాడమీ అధ్యక్షురాలు శుభాధనంజయ సభకు అధ్యక్షత వహించి మాట్లాడారు. సంహిత అరంగేట్రంలో కనబరిచిన హావభావాలు, ఆంగిక అభియనయం అద్వితీయమన్నారు. అకుంఠిత నాట్య సాధనతోనే ఇది సాధ్యమైందన్నారు. సంహిత తల్లిదండ్రులు నందిని విశ్వనాథ్, అవధానం శ్రీనాథ్ ఆమెలోని నాట్య అభిరుచిని గుర్తించి ఐదో ఏటనే భరత నాట్యంలో శిక్షణ ఇప్పించారన్నారు. రాధికా అయ్యంగార్ వద్ద 11 ఏళ్ల పాటు శిక్షణ పొందారన్నారు. వీరు నగరంలో నాదనర్తన సంగీత, నాట్య పాఠశాలను నిర్వహిస్తూ అనేక మందికి శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. అనంతరం ఏడు కీర్తనలకు సంహిత చేసిన నాట్యం ఆకట్టుకుంది. శ్రీహరి రంగస్వామి, విద్వాన్ నరసింహమూర్తి, విద్వాన్ గోపాల్, వెంకటరమణ వాద్య సహకారం అందించారు. మండ్య శ్రీనటరాజ కళానికేతన్ సంచాలకుడు ప్రకాశ్ ఎస్.అయ్యర్, నందిని విశ్వనాథ్, పద్మావతి, డాక్టర్ అవధానం నాగరాజారావు తదితరులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న కళాకారుల నాట్య ప్రదర్శన

అలరించిన శశిరచంద్ర-24

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే: నగరంలోని ఆద్యషా నృత్య సంస్థ శనివారం రాత్రి 'శశిరచంద్ర-24' పేరిట నిర్వహించిన నాట్యోత్సవం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. ప్రముఖ నృత్య కళాకారులు ప్రదర్శించిన భరత, కథక్, ఒడిసీ నృత్యరీతులు ఆకట్టుకున్నాయి. విదుషీ సరితా మిశ్రా అభినయించిన ఒడిసీ, చింతాపూర్ణదేవి శక్తిపీఠం కథ నృత్యరూపకం అలరించాయి. సంగీతా చటర్జీ కథక్ పదవిన్యాసం, శివ సతీదేవుల నాట్యహేల ప్రేక్షకుల మన్నన పొందాయి. ఆద్యషా నృత్య సంస్థ నిర్వాహకురాలు సరితామిశ్రా శిష్యురాళ్ల నాట్య విన్యాసం, అపర్ణా వినోద్ మీనన్ భరత నాట్యం సభను ఆనందపరిచింది.

పోలీసు అమరవీరులకు ఘన నివాళి



చిక్కబళ్లాపుర: పోలీసు సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లాధికారి

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే: ప్రజలు ప్రశాంతంగా ఉండేందుకు పోలీసులు అహర్నిశలు శ్రమిస్తూ ఉంటారని జిల్లా పాలనాధికారి రవీంద్ర అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం అనకనూరు సమీపంలోని జిల్లా పోలీసు కవాతు మైదానంలో ఆయన అమరవీరులకు నివాళులర్పించి మాట్లాడారు. సంఘ విద్రోహక శక్తులు, అనుమానాస్పద వ్యక్తుల వివరాలను పోలీసులకు ప్రజలు తెలియజేస్తే నేరాలను మరింత సమర్థమంతంగా నియంత్రించవచ్చన్నారు. మైదానంలో అమర వీరుల స్మారక స్తూపాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్పీ చౌక్సే, అధికారులు డాక్టర్ ఎన్.భాస్కర్, రాజా ఇమాం ఖాశీం, శివకుమార్, సీనియరు జర్నలిస్టు ఎన్.దయాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రదుర్గం, న్యూస్‌టుడే: ఆధునిక సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాణాలను లెక్కచేయకుండా శ్రమిస్తున్న పోలీసుల సేవలు ఎన్నటికీ మరువలేనివని జిల్లా పాలనాధికారి వెంకటేశ్ అన్నారు. ఆయన ఇక్కడ పోలీసు అమర వీరుల స్మారకానికి పుష్పగుచ్ఛం సమర్పించి మాట్లాడారు. విధుల నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరులు నివాళులర్పించడం అందరి బాధ్యత అన్నారు. 1959 నుంచి ఇప్పటివరకు దేశంలో 40 వేలమందికి పైగా పోలీసులు విధుల నిర్వహణలో ప్రాణాలు త్యాగం చేశారని చెప్పారు. జిల్లా ఎస్పీ రంజిత్ కుమార్ బండారు అమరవీరుల పేర్లు చదివి వారికి నివాళులర్పించారు.



చిత్రదుర్గం: స్తూపానికి పుష్పగుచ్ఛం సమర్పిస్తున్న ఎస్పీ రంజిత్‌కుమార్ బండారు

బెంగళూరు 'కంబళ'పై పెటా అభ్యంతరం

బెంగళూరు (సదాశివనగర): బెంగళూరు ప్యాలెస్ మైదానంలో ఈ నెల 25న కంబళ పోటీలను నిర్వహించకుండా ఆదేశించాలని కోరుతూ ఉన్నత న్యాయస్థానంలో పెటా వ్యాజ్యాన్ని దాఖలు చేసింది. వివిధ ప్రాంతాల నుంచి దున్నపోతులను బెంగళూరుకు తీసుకు వచ్చే సమయంలో అవి హింసకు గురవుతాయని పెటా ప్రతినిధులు తమ వ్యాజ్యంలో పేర్కొన్నారు. మంగళవారం ఈ అర్జీ విచారణకు వచ్చే అవకాశం ఉందని పెటా ప్రతినిధులు తెలిపారు.

పరిషత్ పోరులో 97.91 శాతం ఓటింగ్

ఉడుపి: దక్షిణ కన్నడ, ఉడుపి స్థానిక సంస్థల విధానపరిషత్ నియోజకవర్గం ఎన్నికల్లో 97.91 శాతం పోలింగ్ జరిగింది. భాజపా నుంచి బీఆర్ కిశోర్, కాంగ్రెస్ నుంచి రాజు పూజారి, ఎస్‌డీపీఐ నుంచి అన్వర్ సాదత్, స్వతంత్ర అభ్యర్థిగా దినకర్ ఉళ్లాల పోటీలో ఉన్నారు. పోలింగ్ కోసం 392 బూత్‌లను ఏర్పాటు చేశారు. మంగళూరు సెయింట్ అలోషియస్ పీయూ కళాశాలలో గురువారం ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉంటుందని ఉడుపి జిల్లాధికారి విద్యాకుమారి తెలిపారు.

కుల గణన ఎందుకు?

శివమొగ్గ, న్యూస్‌టుడే : ప్రజాస్వామ్య వ్యవస్థలో లౌకిక ప్రభుత్వం ఉన్నప్పుడు కుల గణన ఎందుకని ఉడుపి పెజావర మఠాధిపతి విశ్వప్రసన్నతీర్థ స్వామి ప్రశ్నించారు. శివమొగ్గలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. కులరహిత సమాజాన్ని ఏర్పాటు చేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వాలు ఇప్పుడు కుల గణన ఎందుకు చేస్తున్నాయని ప్రశ్నించారు. రామరాజ్యం స్థాపనకు రామమందిరం అవసరమన్నారు. తమ మఠం తరఫున నిర్వాసితులకు ఇళ్లు కట్టించి ఇస్తున్నామని తెలిపారు. మానవ సేవే రాముని సేవ అని తాను భావిస్తానని చెప్పారు.

ఏషియన్ నెట్‌బాల్ పోటీలు వాయిదా



కోరమంగళలో జరుగుతున్న 13వ ఏషియన్ మహిళల నెట్‌బాల్ పోటీలు ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షంతో వాయిదా పడ్డాయి. ఇండోర్ క్రీడాంగణంలో వాన నీరు చేరుకోవడంతో రెండు పోటీలను వాయిదా వేశారు. రాజకాలువలు వర్షం నీటితో నిండిపోవడంతో పాటు విద్యుత్ సమస్య తలెత్తడంతో పోటీలను వాయిదా వేశామని వాటిని 24న నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈనెల 18 నుంచి ఉద్యాననగరంలో ఈ పోటీలు సాగుతున్న విషయం తెలిసిందే. 27న ఫైనల్స్ జరుగనున్నాయి. -న్యూస్‌టుడే, బెంగళూరు (క్రీడలు)

నోరు అదుపులో ఉంచుకో

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: తన తల్లి మైత్రాదేవి హరణాన్ని రాజకీయాలకు వాడుకుంటున్న మంత్రి సురేశ్‌పై భాజపా అధ్యక్షుడు బీవై విజయేంద్ర విరుచుకుపడ్డారు. రెండున్నర దశాబ్దాల కింద జరిగిన ఘటనను మళ్లీ తెరపైకి తెచ్చిన మంత్రి భైరతి సురేశ్ తీరును ఆయన విమర్శించారు. ముడా అక్రమాలకు సంబంధించి త్వరలో కారాగారం వెళతానన్న భయం ఆయనను వెంటాడుతోందని ఎద్దేవా చేశారు. ఇకపై ఆధార రహిత ఆరోపణలు, ప్రకటలు చేస్తే తదుపరి పరిణామాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు.

కొనసాగుతున్న రామస్వామి క్రికెట్ టోర్నీ

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: కర్ణాటక క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన వై.ఎస్.రామస్వామి స్మారక ట్రోఫీ పోటీల్లో చంద్ర సాధించిన శతకంతో మాగడికి చెందిన ఇలెవెన్ బ్రదర్స్ క్రికెట్ జట్టు 44 పరుగుల తేడాతో జోడియాక్‌పై విజయం సాధించింది. సోమవారం నగరంలోని వేర్వేరు మైదానాల్లో పోటీలు జరిగాయి. ఇతర పోటీల్లో యంగ్ క్రికెటర్స్-బి కోలారుకు చెందిన యంగ్‌క్రికెటర్స్, యువక సంఘ జట్టు యూత్ క్రికెట్, బెంగళూరు స్పోర్ట్స్ జట్టు బెంగళూరు యునైటెడ్ క్రికెట్ బీపై గెలిచాయి.

అలరించిన ఫుట్‌బాల్ పోటీలు

బెంగళూరు (క్రీడలు) : కర్ణాటక ఫుట్‌బాల్ సంఘం నిర్వహిస్తున్న సూపర్ డివిజన్ పోటీల్లో కిక్‌స్టార్ట్ జట్టు 2-1 గోల్స్ తేడాతో కొడుగుపై గెలుపొందింది. సోమవారం జరిగిన పోటీలో అంతర్జాతీయ మాజీ ఫుట్‌బాల్ ఆటగాడు మ్యాథ్యూస్ మృతికి మౌనం పాటించారు. విజేత జట్టుకు ఎస్.బి.సింగ్, అభిషేక్‌శంకర్‌పవార్ చెరీ ఒక్కో గోల్ వేశారు. మరో పోటీలో శరవణకుమార్ సాధించిన ఏకైక గోల్‌తో బెంగళూరు ఇండిపెండెంట్స్ జట్టు రియల్ బెంగళూరుపై నెగ్గింది.

ఫుట్‌బాల్ క్రీడాకారుడు మాథ్యూస్ మృతి

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: రాష్ట్రానికి చెందిన అంతర్జాతీయ ఫుట్‌బాల్ మాజీ క్రీడాకారుడు మాథ్యూస్ సోమవారం ఆయన నివాసంలో మృతి చెందారు. మహాదేవపుర నివాసి మాథ్యూస్‌కు భార్య, ఇద్దరు కుమారులున్నారు. కెనడీ స్పోర్ట్స్ క్లబ్ నుంచి తన కెరియర్‌ను ప్రారంభించిన ఆయన సీఐఎల్, ఐటీఐ, హెచ్ఏఎల్ క్లబ్‌ల తరఫున పోటీల్లో పాల్గొన్నారు. 1972 నుంచి కర్ణాటక జట్టులో సభ్యుడిగా అనేక జాతీయ పోటీల్లో తలపడిన ఆయన 1975లో జూనియర్ ఇండియా శిబిరంలో పాల్గొన్నారు. అదే ఏడాది కువైట్‌లో జరిగిన అంతర్జాతీయ పోటీలో జూనియర్ ఇండియా తరఫున ఆడారు. సంతోష్ ట్రోఫీతో పాటు బెంగళూరు జిల్లా ఫుట్‌బాల్ సంఘం నిర్వహించిన స్టాఫర్డ్ ఛాలెంజ్ కప్, జార్జ్‌హావర్ కప్ పోటీలో ఐటీఐ, హెచ్ఏఎల్ జట్లకు ఆడారు. మాథ్యూస్ మృతికి కర్ణాటక ఫుట్‌బాల్ సంఘం సంయుక్త కార్యదర్శి సత్యనారాయణ, బెంగళూరు జిల్లా ఫుట్‌బాల్ సంఘం ఛైర్మెన్, పదాధికారులు సంతాపం వ్యక్తం చేశారు. ఐటీఐ, హెచ్ఏఎల్ క్లబ్‌ల మాజీ ఆటగాళ్లు మృతుడి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పానీపురి వ్యాపారి హత్య

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: పానీపురి వ్యాపారిపై దాడి చేసి తలపై రాళ్లతో కొట్టి దుండగులు హత్య చేసి పరారైన ఘటన ఆదివారం రాత్రి ఎలక్ట్రానిక్ సిటీ పోలీసు ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. హతుడిని ఉత్తరప్రదేశ్ నివాసి సమేశ్(24)గా పోలీసులు గుర్తించారు. పానీపురి తిన్న దుండగులు డబ్బులివ్వకుండా వెళుతుండగా వ్యాపారి వారిని చెల్లించాలని నిలదీశారు. ఆగ్రహించిన దుండగులు సమేశ్‌తో గొడవపడి హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆటో వీలింగ్: డ్రైవర్ అరెస్టు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: నగరంలోని వివిధ రహదారులపై రాత్రుళ్లు ఆటో వీలింగ్ చేస్తున్న చోదకుడు ఆకాశ్‌ను నెలమంగల పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం రాత్రి జాతీయ రహదారి 75, నెలమంగల-కుణిగల్ మార్గంలో ఆటో వీలింగ్‌కు పాల్పడుతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు దాడి చేసి ఆయనను అరెస్టు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

క్రైం కార్నర్

మాదకద్రవ్యాల కేసులో నిందితుల విచారణ

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: విదేశాల నుంచి తపాలా కార్యాలయాలకు పార్శిల్ రూపంలో వచ్చిన మాదకద్రవ్యాలపై సీసీబీ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇప్పటికే నగరంలో వివిధ ప్రాంతాల్లో మాదకద్రవ్యాలను సరఫరా చేస్తున్న డ్రగ్స్ పెడ్లర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. కస్టమ్స్, సీసీబీ అధికారులు సంయుక్తంగా నగరంలోని చామరాజపేటలోని విదేశీ తపాలా కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. వివిధ దేశాల నుంచి వచ్చిన 3,500 పార్శిళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అందులో 606 పార్శిళ్లలో మాదకద్రవ్యాలు ఉన్నట్లు గుర్తించారు. వాటి విలువ రూ.21.17 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. సీసీబీ పోలీసులు 12 కేసులు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. హాంకాంగ్, థాయ్‌లాండ్, అమెరికా, బ్రిటన్ తదితర దేశాల నుంచి అవి వచ్చినట్లు గుర్తించారు.

నిబంధనల ఉల్లంఘనపై కేసులు

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే: నగరంలోని వివిధ ప్రాంతాల్లో సంచార పోలీసులు ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు వాహనాల తనిఖీలు చేపట్టారు. మొత్తం 49,371 వాహనాలను తనిఖీలు చేశారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 579 మంది వాహనచోదకులపై కేసులు నమోదు చేశారు.

బళ్ళారి

• బళ్ళారి • రాయచూరు

సమన్వయంతో పనిచేస్తేనే విజయం

రాయచూరు, న్యూస్‌టుడే: రాయచూరులో ఈ ఏడాది చివర్లో నిర్వహించనున్న దళిత సాహిత్య పరిషత్ రాష్ట్ర సమ్మేళనం విజయవంతానికి ఇప్పటి నుంచే రాష్ట్రాధ్యక్షుడు డాక్టర్ అర్జున్ గోళసంగి కోరారు. స్థానిక ప్రభుత్వ ఉద్యోగుల సంఘం భవనంలో సోమవారం సన్నాహక సమావేశం జరిగింది. అధ్యక్షత వహించిన అర్జున్ మాట్లాడుతూ సమ్మేళనం నిర్వహణకు నియమించిన వివిధ సమితులు సమన్వయంతో కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. బుద్ధుడు, బసవేశ్వరుడు, అంబేడ్కర్ ఆలోచనలపై విస్తృతంగా చర్చిస్తారన్న అంశాన్ని బాగా ప్రచారం చేయాలన్నారు. పరిషత్ జిల్లా అధ్యక్షుడు తాయరాజ్ మర్చటేడ్‌ను సమ్మేళనం సంయోజకుడిగా, సింధనూరు తాలూకా అధ్యక్షుడు డాక్టర్ హుస్సేనప్పను సహ సంయోజకుడిగా నియమించినట్లు ఆయన వెల్లడించారు.

అబాకస్ పోటీల్లో చిన్నారి సత్తా

రాయచూరు, న్యూస్‌టుడే: బ్రెయిన్‌బ్రైట్ అంతర్జాతీయ స్థాయి అబాకస్ 44వ పోటీల్లో పట్టణానికి చెందిన విద్యార్థిని అన్విత హళ్లి ప్రథమ ఛాంపియన్‌గా నిలిచారు. ఈ నెల 19, 20 తేదీల్లో తమిళనాడు రాష్ట్ర రాజధాని చెన్నైలో నిర్వహించిన పోటీల్లో దేశ, విదేశాలకు చెందిన పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. అన్విత వేగంగా సంఖ్యలను గుర్తించడంతో ప్రథమ విజేతగా ఎన్నికైనట్లు నిర్వాహకులు ప్రకటించి కప్ అందజేశారు. రాయచూరులోని విద్యాభారతి సీబీఎస్‌ఇ పాఠశాలలో అన్విత నాల్గో తరగతి చదువుతోంది. ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు. విద్యార్థిని తండ్రి డాక్టర్ బసవరాజహళ్లి పట్టణంలో పేరుగాంచిన దంత వైద్యుడు.



కప్ అందుకుంటున్న అన్విత

ఆవిష్కరణలపై అవగాహన తప్పనిసరి

● వైద్య విద్యార్థులకు వక్తల సూచనలు

రాయచూరు, న్యూస్‌టుడే: వైద్య విద్యారంగంలో ఈ రంగంలో జరిగే కొత్త ఆవిష్కరణలపై తప్పనిసరిగా అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం వైద్య విద్యార్థులపై ఉందని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (కర్ణాటక) డాక్టర్ ఎస్‌టీ శ్రీనివాసమూర్తి సూచించారు. నవోదయ వైద్య కళాశాలలో 2024-25 ఏడాదిలో ప్రవేశం పొందిన 22వ బ్యాచ్ విద్యార్థులకు సోమవారం కళాశాల ఎస్.ఆర్.హెగ్డే సభాంగణంలో స్వాగత కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ వైద్యం కొత్త పుంతలు తొక్కుతున్న నేపథ్యంలో విద్యార్థి దశ నుంచే సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. తద్వారా వృత్తిరంగా రాణించేందుకు దోహదపడుతుందన్నారు. నవోదయలో నిపుణ వైద్యులు, అధ్యాపకులు, మెరుగైన ప్రయోగశాలలు ఉన్నందునే రాష్ట్ర స్థాయిలో గుర్తింపునకు నోచుకుందన్నారు. కళాశాలలోని సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించాలని ఆకాంక్షించారు. రిజిస్ట్రార్ డాక్టర్ తాడిపత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ వైద్య సంబంధ పుస్తకాలను నిత్యం చదవాలని, పరిశోధనలపై ఆసక్తి కలిగిన విద్యార్థులను ప్రోత్సహిస్తామన్నారు. డైరెక్టర్ డాక్టర్ పి.విజయకుమార్ ప్రసంగిస్తూ చదువుకోవడానికి చక్కటి వాతావరణం కల్పించనందునే రాజీవ్‌గాంధీ విశ్వ విద్యాలయం పరిధిలో నవోదయకు ఏటా ర్యాంకులు వస్తున్నాయని గుర్తుచేశారు. వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ దేవానంద మాట్లాడుతూ విద్యార్థులు చదువులోనే కాకుండా క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో అద్భుత ప్రతిభ కనబరుస్తుండటం ఆనందంగా ఉందన్నారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.ఎస్. ఆనంద్ మాట్లాడుతూ నాణ్యమైన బోధనతోనే ఏటా ఉత్తమ ఫలితాలు వస్తున్నాయని తెలిపారు. మైక్రో బయాలజీ ఆచార్యుడు ఆనందకుమార్, బయో కెమిస్ట్రీ హెచ్‌ఓడీ విశాల్, ఫోరెన్సిక్స్ మెడిసన్ హెచ్‌ఓడీ డాక్టర్ బందే నవాజ్, బయో కెమిస్ట్రీ ఆచార్యుడు డాక్టర్ కె.శ్రీనివాస్‌రావు తదితరులు మాట్లాడారు.





హాజరైన ఆయా శాఖల ముఖ్యులు, విద్యార్థులు, వేదికపై ఉపన్యసిస్తున్న శ్రీనివాసమూర్తి

పోలీసుల సేవలు చిరస్మరణీయం

రాయచూరు, న్యూస్‌టుడే: సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాణాలర్పించిన అమరవీరులైన పోలీసు అధికారులు, సిబ్బందిని స్మరించుకోవడం మనందరి కర్తవ్యమని, వారి సేవలు ఎప్పటికీ మరువలేనివని జిల్లా పాలనాధికారి కె.నితీష్ అన్నారు. ఎస్పీ కార్యాలయ మైదానంలో సోమవారం నిర్వహించిన అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అమరవీరుల స్థూపానికి పూలదండ వేసి నివాళులర్పించారు. పోలీస్ దళం గౌరవ వందనం స్వీకరించి మాట్లాడారు. సైన్యంలో పనిచేస్తున్న వారికి లభించే గుర్తింపు పోలీసులకు లభించకపోవడం శోచనీయమన్నారు. 24 గంటలూ విధుల్లో ఉండే పోలీసులను విమర్శించడం తగదన్నారు. ఎక్కడో ఒకచోట పోలీస్ తప్పుచేస్తే దాన్ని సామాజిక మాధ్యమాల్లో వ్యాప్తి చేస్తున్నారే తప్ప, వారి సాధనలను స్మరించుకోవడం లేదని బాధపడ్డారు. ఉగ్రవాదుల దాడుల్లో, హింసాత్మక ఘటనలను నియంత్రించే సమయంలో ప్రాణాలకు తెగిస్తున్న పోలీసులకు సమాజం వెన్నుదన్నుగా ఉండాల్సిన అవసరముందన్నారు. ఎస్పీ పుట్టమాదయ్య మాట్లాడుతూ నేరస్థులను పట్టుకునేందుకు, నేర కార్యకలాపాల కట్టడికి శ్రమిస్తున్న పోలీసులకు ప్రజల సహకారం కావాలని కోరారు. వృత్తిపరంగా ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తూ సమర్థమంతంగా పనిచేస్తున్నారని కితాబు ఇచ్చారు. వేదికపై ఏఎస్పీలు శివకుమార్, హరీష్ కూర్చున్నారు. తొలుత అమరవీరులకు గౌరవ పూర్వకంగా పోలీసులు గాలిలో తుపాకులతో పేల్చారు.



అమరవీరుల గౌరవార్థం
తుపాకులతో గాలిలో పేలుస్తున్న పోలీసులు

ఏఐయూటీయూసీ సమ్మేళనానికి పిలుపు

రాయచూరు, న్యూస్‌టుడే: ఏఐయూటీయూసీ రాష్ట్ర కార్మిక నాలుగో సమ్మేళనాన్ని పురస్కరించుకుని రాయచూరు తాలూకాలోని పారిశ్రామికవాడలో సంచరించే వాహనాల జాతా సోమవారం మొదలైంది. ఆర్టీసీ బస్టాండ్ వద్ద సంఘం రాష్ట్ర కార్యకారి సభ్యుడు ఎన్.ఎస్.వీరేశ్ ప్రారంభించి మాట్లాడారు. దేశాన్ని ఎక్కువ కాలం పాలించిన కాంగ్రెస్, పదేళ్లుగా అధికారంలో ఉంటున్న భాజపా ప్రభుత్వాలు అనుసరించిన ఆర్థిక, సరళీకరణ విధానాలతో దేశ సంపదలో అధిక భాగం పెట్టుబడిదారుల చేతుల్లోకి వెళ్లిందన్నారు. దీనివల్ల కార్మికులు తమ హక్కులు, ప్రయోజనాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా బలమైన ఉద్యమాన్ని రూపొందించేందుకు మైసూరులో 26, 27వ తేదీల్లో సమ్మేళనం జరుగుతుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయవద్దని, పొరుగు సేవల విధానాన్ని రద్దు చేయాలని, కార్మికులకు శాసనబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని, కనీస వేతనంగా రూ.35 వేలు ఇవ్వాలని ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తామన్నారు. మైసూరుకు కార్మికులు పెద్దఎత్తున తరలివచ్చి సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. జాతాలో జిల్లా కార్యదర్శి మహేశ్, ఉపాధ్యక్షుడు అణ్ణప్ప, సభ్యులు చేతన్, రాము, మారెప్ప, బసవరాజ్, భీమణ్ణ, శాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న వీరేశ్

రక్తదానం ఆరోగ్యదాయకం

రాయచూరు, న్యూస్‌టుడే: రక్తాన్ని ఇస్తే ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తవని డీహెచ్‌ఓ డాక్టర్ సురేంద్రబాబు అన్నారు. జిల్లా యంత్రాంగం, నవోదయ ఆసుపత్రి, రోటరీ, లయన్స్ క్లబ్, ఎస్.కె.ప్యారా మెడికల్ కళాశాల, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలోసోమవారం ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని జరిపారు. ఈ సందర్భంగా డీహెచ్‌ఓ కార్యాలయం వద్ద చేపట్టిన జాతాను సురేంద్ర బాబు పచ్చజెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. సకాలంలో రక్తమందితే ఎంతోమంది ప్రాణాలు కాపాడవచ్చన్నారు. రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులకు రక్తం కోసం కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతుంటారని, కావాల్సినంత అందుబాటులో ఉంటే చికిత్సను వేగంగా అందించవచ్చన్నారు. రోగులను రక్షించేందుకు వైద్యుడు ఎంత ముఖ్యమో దాతల పాత్ర అంతేనన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని స్వచ్ఛందంగా రక్తదానానికి యువత ముందుకు రావాలని కోరారు. జిల్లా సర్జన్ డాక్టర్ విజయశంకర్ మాట్లాడుతూ దాతలు ముందుకొచ్చేలా ప్రేరణ కలిగించాలని కోరారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణాధికారి డాక్టర్ షాకీర్, రిమ్స్ ప్రిన్సిపల్ బసవరాజ్ పాటిల్, మానసిక వైద్యుడు మనోహర్ పత్తార్, వైద్యాధికారులు యశోద, ప్రజ్వల్, ఆరోగ్య శిక్షణాధికారి లక్ష్మి, ఉప శిక్షణాధికారి బసయ్య తదితరులు పాల్గొన్నారు.



జాతాను ప్రారంభిస్తున్న డీహెచ్‌ఓ సురేంద్రబాబు

మంత్రి బోసురాజుపై ఫిర్యాదు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: మంత్రి ఎన్ఎస్ బోసురాజు తన భార్య పేరిట అటవీ భూమిని ఆక్రమించుకున్నారని సామాజిక కార్యకర్త దినేశ్ కల్లహళ్లి ఆరోపించారు. రాయచూరు సమీపంలోని రక్షిత అటవీ భూమిలో 5 ఎకరాల 27 గుంటల భూమిని కబ్జా చేసుకున్నారని పేర్కొన్నారు. మంత్రిపై చర్యలు తీసుకోవాలంటూ గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు.

బస్సు ఢీకొని పాదచారి దుర్మరణం

రాయచూరు: పాదచారిని కల్యాణ కర్ణాటక విభాగం ఆర్టీసీ బస్సు వెనుకనుంచి ఢీకొనడంతో మృతి చెందిన ఘటన ఆదివారం సాయంత్రం రాయచూరు తాలూకా తుంగభద్ర గ్రామ మార్గంలో చోటుచేసుకుంది. మృతుడిని వీరేశ్(34)గా గుర్తించారు. కర్నూలు జిల్లా మంత్రాలయ పరిధి మాధవరం గ్రామ నివాసి వీరేశ్ వ్యక్తిగత పనిపై కర్ణాటక సరిహద్దులోని గిల్లేసూగూరుకు వచ్చి తిరిగి వెళుతుండగా రాయచూరు నుంచి మంత్రాలయం వైపు వెళుతున్న బస్సు ఢీకొట్టింది. తీవ్ర గాయాలతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. డ్రైవర్ బస్సు వదిలి పరారయ్యారు. ఇడపనూరు ఠాణా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు బాలలు నీటిపాలు

మండ్య, న్యూస్‌టుడే : ఈత రాకపోయినా చెరువులో దిగి శంకరపురానికి చెందిన సోము (14), ముత్తురాజు (17) అనే బాలలు నీట మునిగి మరణించారు. మద్దూరు తాలూకా దేశహళ్లి గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఐదుగురు స్నేహితులు చెరువు వద్దకు వెళ్లగా వీరిద్దరూ నీట మునిగిపోయారు. ముత్తురాజు మృతదేహాన్ని అగ్నిమాపకదళ సిబ్బంది వెలికి తీశారు. సోము మృతదేహం కోసం గాలింపు చేపట్టారు. బెసగరహళ్లి ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వర్గీకరణ అర్థరహితమంటూ ధర్నా

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : ఎలాంటి శాస్త్రీయ అధ్యయనం చేయకుండా ఏకపక్షంగా ఎస్టీ వర్గాల రిజర్వేషన్‌ను వర్గీకరించకూడదని డిమాండు చేస్తూ బెంగళూరు స్వాతంత్ర్య ఉద్యానవనంలో బంజార సంక్షేమ సంఘం సభ్యులు సోమవారం ధర్నాకు దిగారు. గిరిజనుల ఆర్థిక, సామాజిక పరిస్థితులను అధ్యయనం చేయాలని పట్టుబట్టారు. వారి సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని బంజార ధర్మ గురువులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పూర్తి స్థాయిలో ఎస్టీల రిజర్వేషన్ అమలు అవసరాన్ని అధ్యయనం చేయాలని నినదించారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

మాన్వి,న్యూస్‌టుడే: అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ కనీస అవగాహన కలిగి ఉండాలని స్థానిక అగ్నిమాపక ఠాణాధికారి రంగప్ప అన్నారు. స్థానిక ప్రభుత్వ పరిశ్రమల శాఖ తర్ఫీదు కార్యాలయంలో సోమవారం ఐటీఐ కళాశాల విద్యార్థులకు జరిపిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే ఆ శాఖ దళానికి సమాచారం ఇవ్వాలని చెప్పారు. దీనివల్ల జరగబోయే భారీ ప్రమాదాలు, ప్రాణనష్టాన్ని నివారించవచ్చన్నారు. ప్రమాద స్థలిలో గ్యాస్, రసాయనాలు, విద్యుత్తు పరికరాలను దూరంగా ఉంచాలన్నారు. అగ్ని ప్రమాదాన్ని నిలువరించే పరికరాలను అమర్చుకోవడం ద్వారా నష్టాన్ని తగ్గించవచ్చన్నారు. వేసవిలోనే అధికంగా ప్రమదాలు జరుగుతాయన్నారు. గుడిసెలు, దూళ్లపాకలు, పత్తి, ధాన్యం రాసులు, గడ్డివాములను అగ్నికి దూరంగా ఉంచాలన్నారు. ఈ సందర్భంగా ఫైరింజిన్లతో అగ్నిప్రమాదాలను ఎలా నిలువరించ వచ్చో ప్రత్యక్షంగా చూపించారు. అగ్నిమాపక శాఖ సహాయక అధికారి హాజిమిమా, ప్రభుత్వ పరిశ్రమల తర్ఫీదు సంస్థ ప్రిన్సిపల్ ఎస్.ఎం.పాషా, శిక్షకుడు వీరేశ్, ఐటీఐ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు వివరిస్తున్న అగ్నిమాపక అధికారులు



నగరసభ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న కరవే నాయకులు

చిరు వ్యాపారుల జోలికెళ్లకండి

సింధనూరు, న్యూస్‌టుడే: పొట్టపోసుకోడానికి ఎలాంటి వ్యాపార స్థలం చూపించకుండా పట్టణంలోని పాదచారి మార్గంలో ఉన్న దుకాణాలను ఖాళీ చేయిస్తే సహించేది లేదు. .తీవ్రస్థాయిలో పోరాటం చేస్తామని కర్ణాటక రక్షణా వేదిక నాయకులు నగరసభను హెచ్చరించారు. పట్టణ ప్రధాన రహదారుల్లోని పాదచారి మార్గంలో అనుమతి లేకుండా విస్తరించిన వ్యాపార దుకాణాలు మూడు రోజుల్లో ఖాళీ చాయాలని, లేకుంటే మేమే దగ్గరుండి ఖాళీ చేయిస్తామని నగరసభ వ్యాపారులకు తాఖీదులు అందించింది. మూతవేసి ఉన్న దుకాణాలకు తాఖీదులు అతికించింది. దీంతో రక్షణ వేదిక సోమవారం పోరాటానికి దిగింది. పాదచారి మార్గం వ్యాపారులకు మద్దతుగా నిలిచింది. మొదట వాళ్లకు ఎక్కడైనా వ్యాపార స్థలాన్ని చూపించి. .తాఖీదులు ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు నిరసన ప్రదర్శన చేసి కమిషనర్‌కు వినతిపత్రం అందించింది. కరవే జిల్లా నాయకులు గంగణ్ణ, రామకృష్ణ భజంత్రీ పాల్గొన్నారు.

అంచనాకు మించి ఆర్థిక ప్రగతి

ఈనాడు, బెంగళూరు : మునుపెన్నడూ లేని కరవు పరిస్థితులు అలముకున్నా.. భౌగోళిక, రాజకీయ పరిస్థితులు ఐటీ రంగాన్ని దెబ్బతీసినా రాష్ట్ర ఆర్థిక ప్రగతికి ఇబ్బందులేమీ ఎదురుకాలేదని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వెల్లడించారు. జాతీయ ఆర్థిక గణాంకాల అంచనాలకు మించి రాష్ట్రం మెరుగైన ఆర్థిక ప్రగతిని సాధించిందని ప్రకటించారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ ఇదే జోరు కొనసాగిస్తామని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. సోమవారం ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటించిన రాష్ట్ర ఆర్థిక నివేదిక వివరాలిలా ఉన్నాయి.

జీఎస్‌డీపీలో దూకుడు..

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ఐటీ ఎగుమతులు దేశవ్యాప్తంగా దెబ్బతిన్నాయి. భారతదేశానికి అత్యధిక ప్రమాణంలో ఐటీ ఉత్పత్తులు అందిస్తున్న కర్ణాటక ఈ ప్రభావానికి లోనైంది. కరవు పరిస్థితులు ఆర్థిక కార్యకలాపాలను దెబ్బతీయటంతో కర్ణాటక రాష్ట్రం 2023-24 ఆర్థిక సంవత్సరంలో కేవలం నాలుగు శాతం ఆర్థిక ప్రగతిని మాత్రమే సాధించగలదని అంచనా వేశారు. ఈ ఏడాది చివరి నాటికి ఆ ప్రగతి 13.4 శాతంగా నమోదు కాగలదని జాతీయ ఆర్థిక గణాంకాల అంచనా(ఎన్ఎస్ఈ) విభాగంతో పాటు కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు శాఖ(ఎంఓఎస్‌పీఐ)లు ప్రకటించాయి. ఈ అంచనాకు మీరి కర్ణాటక రాష్ట్రం సెప్టెంబరు నాటికే జీఎస్‌డీపీలో 10.2 శాతం ప్రగతిని నమోదు చేసింది. ఈ ప్రగతి జాతీయ స్థూల దేశీయోత్పత్తి (8.2శాతం)తో పోలిస్తే రెండు శాతం ఎక్కువ. ప్రస్తుత ప్రగతి దృష్ట్యా 2025 ఆర్థిక సంవత్సరానికి 14 శాతం ప్రగతి సాధించే అవకాశం ఉందన్న ఆశాభావాన్ని ముఖ్యమంత్రి అంచనా వేశారు.

భయాలను వీడి..

కరవు కారణంగా రాష్ట్ర వ్యవసాయ రంగలో ఉత్పాదన సన్నగిల్లింది. ఐటీ రంగం ప్రపంచ యుద్ధాల కారణంగా కుదేలయ్యింది. ఆర్థిక రంగంలో ద్రవ్యోల్బణం దూసుకొస్తుందన్న భయంలోనూ రాష్ట్ర ఐటీ, హార్డ్‌వేర్ రంగంలో 28 శాతం జీఎస్‌వీఏ (స్థూల రాష్ట్ర విలువ ఆధారిత వృద్ధి)ని సాధించింది. ఇదే సందర్భంగా దేశ ఐటీ రంగం 2022 ఏడాది 15.5 శాతంతో పోలిస్తే 2023లో కేవలం ఎనిమిది శాతమే ప్రగతిని నమోదు చేసినట్లు ముఖ్యమంత్రి ఆర్థిక సలహా విభాగం విశ్లేషించింది. ఈ కారణాలే రాష్ట్ర ప్రగతిపై ప్రభావం చూపుతుందని ఎన్ఎస్ఈ అంచనా వేసి ఉండవచ్చు. ఈ ఏడాది సెప్టెంబరు నాటికి రాష్ట్రం జీఎస్‌టీ వసూళ్లలో 10 శాతం ప్రగతి, స్టాంప్ డ్యూటీలో 24 శాతం ప్రగతిని నమోదు చేసింది. ఇందుకు కారణం.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాలు, ఐదు గ్యారంటీలు, పరిశ్రమలను ప్రోత్సహించే వాతావరణమే కారణం. ఐదు గ్యారంటీల కారణంగా రాష్ట్రంలోని ప్రతి వ్యక్తి ఆర్థిక కార్యకలాపాల్లో తనవంతుగా భాగస్వామ్యాన్ని నమోదు చేశారు.

ఐసీసీ సమావేశం నిర్వహణకు డిమాండ్

సిరివార (మాన్వి), న్యూస్‌టుడే: తాలూకాలో రైతులు సాగు చేస్తున్న మెట్ట పంటలకు నీటి నిర్వహణ చేపట్టాలని కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం డిమాండ్ చేసింది. సంఘం తాలూకా సంచాలకుడు అమరేశ్ చాగబావి సోమవారం స్థానిక ఐబీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిరివార నీటిపారుదల శాఖ సబ్-డివిజన్ పరిధిలో కాలువపై తిరిగేందుకు సిబ్బంది, అధికారుల కొరత ఉందన్నారు. వీరిని భర్తీ చేయందే కాలువకు నీరు చేరడం కష్టమన్నారు. రాత్రింబవళ్లు ఒకరే పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సిరివార సబ్-డివిజన్‌కు మహిళా జేఈ ఉన్నారని, ఆమెని మార్చాలని కోరారు. తుంగభద్ర కాడా అధ్యక్షుడినీ మార్చాలని డిమాండ్ చేశారు. తుంగభద్ర కాలువ పరిధిలో సాగు చేసుకుంటున్న కర్షకులకు రెండో పంటకు నీటి విడుదలపై త్వరగా ఐసీసీ సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. నవంబరు మొదటి వారంలో ప్రభుత్వం నిర్ణయాన్ని వెలువరించాలని లేకుంటే రైతుల్లో గందరగోళం నెలకొంటుందన్నారు. ఏప్రిల్ 10 వరకు నీరు విడుదల చేస్తేనే రెండో పంట అన్నదాతల చేతికి వస్తుందన్నారు. సంఘం ప్రతినిధులు వెంకటేశ్, శివకుమార్, అమరేశ్ మంత్రి, శరణప్పగుడదిన్ని, జగన్నాథ్, రాజశేఖరయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఏమిటీ పరీక్ష? :సుప్రీం

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : వివిధ తరగతులకు అర్ధవార్షిక సంవత్సరం (హాఫ్ ఇయర్లీ) బోర్డు (పబ్లిక్) పరీక్షలు నిర్వహిస్తూ విద్యార్థులను వేధిస్తున్నారా అని రాష్ట్ర ప్రభుత్వాన్ని సర్వోన్నత న్యాయస్థానం తూర్పారబట్టింది. తదుపరి ఆదేశాల వరకు 5, 8, 9, 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన బోర్డు పరీక్షల ఫలితాలను ప్రకటించవద్దని జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ సతీశ్ చంద్రశర్మ పీఠం ఆదేశించింది. ఏ జిల్లాలోనూ ఈ తరహా పరీక్షలను నిర్వహించద్దని తన ఆదేశాల్లో పేర్కొంది. 'విద్యార్థులను ఎందుకు వేధిస్తున్నారు? విద్యార్థులపై ఎందుకు కక్ష సాధిస్తున్నారు? 5, 8, 9 తరగతి విద్యార్థులకు బోర్డు పరీక్షల అవసరం ఏముంది?' అంటూ ప్రభుత్వ న్యాయవాది దేవదత్త కామత్‌పై పీఠం ప్రశ్నల వర్షాన్ని కురిపించింది. ఏడు జిల్లాల్లో ఇప్పటికే బోర్డు పరీక్షలను నిర్వహించారు. మిగిలిన 24 జిల్లాల్లో పరీక్షల నిర్వహణకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ పరీక్షలను రద్దు చేస్తూ ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయాన్ని తీసుకుందని పీఠానికి న్యాయవాది వివరించారు.



సర్జాపుర : తెలతెలవారగనే
ప్రధాన రహదారి ఇలా దర్శనమిచ్చింది



జేజేనగర : వి.ఎస్.గార్డన్‌లో
వాననీరు తెచ్చిపెట్టిన ఇక్కట్లు



ఎంజీ రోడ్డు కూడలి : రహదారిపై నిలిచిపోతున్న
నీటిని కాలువలోకి మళ్లించే ప్రయత్నం



ఇంట్లోకి వచ్చిన నీటిని తోడేసే పనిలో
నిమగ్నం

నడిసంద్రంలా రాజధాని

● మరోసారి ముంచెత్తిన వాననీరు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: వాననీటి ఇక్కట్లు రాజధాని బెంగళూరు నగరాన్ని వీడనే లేదు. ఆదివారం అర్ధరాత్రి మొదలైన వాన.. తెల్లవారే వరకు వెన్నాడిన ఫలితంగా వీధులన్నీ నీటి మడుగుల్లా ప్రత్యక్షమయ్యాయి. అనేక ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ఇళ్లలోకి వాగులు పోటెత్తడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు జనజీవనం స్తంభించింది. రహదారుల్లోకి అడుగు పెట్టడం సాహసంతో కూడిన వ్యవహారంగా మారింది. వాహనాల రాకపోకలకు ఆటంకాలు ఎదురయ్యాయి. కెంగేరి, ఆర్.ఆర్.నగర, దాసరహళ్లి, కోరమంగల, శాంతినగర, అశోక్‌నగర, నాయండనహళ్లి, బ్యాటరాయనపుర, మడివాళ, విల్సన్‌గార్డన్, ఈజిపుర, వివేకానగర, సర్జాపుర, బెళ్లందూరు తదితర ప్రాంతాల్లో జనం పడుతూ లేస్తూ ముందుకు సాగారు. మైసూరు రోడ్డులోని అయ్యణ్ణప్ప లేఔట్‌లో 60 ఇళ్లలోకి వాననీరు చొరబడటంతో రాత్రంతా జనజాగారమే. ఇళ్లలో ఉండే వస్తువులతో పాటు విద్యార్థుల పుస్తకాలూ తడిచిపోయాయి. జేజేనగరలోని వి.ఎస్.గార్డన్‌లో ఉన్న 28 ఇళ్లదీ అదే సమస్య. కోరమంగల, మడివాళ, మైసూరు రోడ్డు, సర్జాపుర, బెళ్లందూరు రహదారుల్లో రెండు అడుగుల ఎత్తున నీరు ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. మైసూరు రోడ్డులోని గాలి ఆంజనేయ ఆలయంలోకి రాజకాలువ పొంగి ప్రవహించింది. మురుగునీటితో ఆ ప్రాంగణం మునిగిపోయి భక్తులను ముక్కులు మూసుకునేలా చేసింది. ఉదయం నుంచి ఆలయాన్ని శుభ్రం చేయడంతోనే సరిపోయింది. ఈ సమస్య అనేక సంవత్సరాలుగా కొనసాగుతున్నా నేటికీ పాలకులు పరిష్కరించలేదని పూజారులు ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు.

✦ సర్జాపుర ఆర్‌జేపీ టెక్‌పార్క్ ప్రదేశం జలమయమైంది. బెళ్లందూరు చెరువు పక్కన సక్రా ఆసుపత్రి రహదారిలోకి పడవలు వేసుకును వెళ్లాలనేంతగా నీరు నిలిచాయి. విల్సన్‌గార్డన్ బీటీఎస్ ప్రధాన రహదారి వాగులా మారింది. ల్యావేలీరోడ్డు, హాల్‌కుల్ రెసిడెన్స్ అపార్ట్‌మెంట్ కింద భాగాలు ముంపుపాలై జనం కకావికలమయ్యారు. జయనగర, జేపీనగర ప్రాంతాల్లో చెట్లు విరిగిపడ్డాయి. వాటిని పాలికె సిబ్బంది, పోలీసులు తొలగించేందుకు శ్రమించారు.

✦ నగరంలో కురిసిన వర్షానికి 97 రహదారులు మునిగితేలినట్లు పాలికె చీఫ్ కమిషనర్ తుషార్‌గిరినాథ్ వెల్లడించారు. కొన్నిచోట్ల మడుగులు తరగక పోవడంతో ఇబ్బందులు ఎదురైనట్లు వివరించారు. నీరు సవ్యంగా ప్రవహించడానికి పాలికె సిబ్బంది శ్రమిస్తున్నారని, బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా నగరంలో వర్షం కొనసాగుతోందని వివరించారు. ఈనెల 22, 23 తేదీల్లో ఇదే స్థాయి వర్షపాతం నమోదయ్యే అవకాశాలుండటంతో యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు.



బెళ్లందూరు : ఐటీ, బీటీ సంస్థలకు వెళ్లే దారి నీటిమయం

రాహుల్ వ్యాఖ్యలపై వ్యాజ్యం తోసివేత

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ 400 మహిళలపై అత్యాచారానికి పాల్పడ్డారంటూ వ్యాఖ్యలు చేసిన లోక్‌సభలో విపక్ష నాయకునిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వచ్చిన వ్యాజ్యాన్ని ఉన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. దావా వేసిన ఆల్ ఇండియా దళిత్ యాక్షన్ కమిటీకి జస్టిస్ ఎన్‌వీ అంజారియా, జస్టిస్ కేవీ అరవింద్‌ల పీఠం రూ. 25 వేల జరిమానా విధించింది. ఇందులో ప్రజాహితం ఏముందని ప్రశ్నించింది. గత లోక్‌సభ ఎన్నికల సమయంలో శివమొగ్గలో నిర్వహించిన బహిరంగసభలో విపక్ష నేత రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. రాహుల్ వ్యాఖ్యలు భారతీయ మహిళలను కించపరిచేవిగా ఉన్నాయని అర్జీదారులు తమ వ్యాజ్యంలో పేర్కొన్నారు.

బెయిల్ నిరాకరణ..

ఒక మహిళపై అత్యాచారానికి పాల్పడిన ఆరోపణలతో అరెస్టయిన మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ బెయిలు కోసం వేసుకున్న అర్జీని ఉన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. హొళెసరసీపుర ఠాణాలో నమోదైన కేసులో ప్రజ్వల్ ఇప్పటికీ పరప్పన అగ్రహార కారాగారంలోనే ఉన్నాడు. విచారణ పూర్తి చేసి- తీర్పును రిజర్వు చేసి ఉంచగా, జస్టిస్ ఎం నాగప్రసన్న బెయిలు అర్జీని తోసిపుచ్చుతున్నట్లు సోమవారం ప్రకటించారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

21-10-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1631.91	1611.77
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	29,516	66
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	29,336	9,887
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.421	41.180

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

హాసనాంబ వేడుకలకు సన్నాహాలు

హాసన, న్యూస్‌టుడే : హాసన నగర అధిదేవత హాసనాంబ జాతర మహోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రతి ఏటా ఆశ్వయుజ మాసం పూర్ణమి అనంతరం వచ్చే మొదటి గురువారం హాసనాంబ ఆలయం తలుపులు తెరుస్తారు. ఈ ఏడాది తొమ్మిది రోజులు మాత్రమే అమ్మవారిని దర్శించుకునేందుకు అవకాశం ఉంటుంది. ఈ ఏడాది కనీసం 20 లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారని అంచనా. ఉచిత దర్శనంతో పాటు రూ.300, రూ.1000 టికెట్లపై దర్శనాలకు అవకాశం కల్పిస్తున్నామని జిల్లా పాలన యంత్రాంగం తెలిపింది.



కోవెలలో కొలువుదీరిన హాసనాంబ

మూత్రపిండం నుంచి అసహజ రాళ్ల తొలగింపు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: రాయచూరుకు చెందిన చాంద్‌పాషా (29) అనే యువకుడి మూత్రపిండాల్లో అసహజ రూపంలో ఏర్పడిన రాళ్లను బెంగళూరులోని సప్తగిరి వైద్యవిద్య కళాశాల, ఆసుపత్రిలోని వైద్యుల బృందం విజయవంతంగా తొలగించింది. సాధారణంగా రాళ్లు గుండ్రంగా ఏర్పడతాయి. చాంద్‌పాషా మూత్రపిండాల్లో అసాధారణంగా నాలుగు పలకలుగా అవి ఏర్పడ్డాయి. పుట్టుక నుంచే ఈ రాళ్లు ఉన్నాయని ఆలస్యంగా గుర్తించారు. కళాశాల ఆచార్యుడు డాక్టర్ ఎం.శివలింగయ్య నేతృత్వంలో వైద్యులు అర్జున్, ధనశేఖర్, పృథ్వీరాజ్ శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. వీటిని తొలగించిన అనంతరం మూత్రకోశ సమస్యలు పూర్తిగా తొలిగాయని చాంద్‌పాషా తెలిపారు.



ఎక్స్‌రేలో కనిపిస్తున్న రాళ్లు